ప్రజాశక్తి

ఆదివారం 5 ఫిబ్రవరి 2023

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

వార్డులను పరిశీలిస్తున్న మంత్రి రజని

మెరుగైన వైద్య సేవలే ప్రభుత్వ ధ్యేయం

కెజిహెచ్‌లో మరిన్ని అధునాతన సౌకర్యాలు - రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రజని

కెజిహెచ్‌కు వివిధ జిల్లాల నుంచి వచ్చే రోగులకు అధునాతన వైద్య సౌకర్యాలను ఉపయోగించి మెరుగైన వైద్యం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడదల రజని తెలిపారు. రూ.1.25 కోట్ల నిధులతో కెజిహెచ్‌లో పలు విభాగాలలో నూతనంగా ఏర్పాటు చేసిన అదనపు సౌకర్యాలను, రినోవేషన్ పనులను శనివారం ఉదయం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎస్ఆర్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడారు. అనంతరం ఆసుపత్రిలోని పలు విభాగాలను సందర్శించి వాటి పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రధాన వార్త మెయిన్‌లో..

వాల్తేరుకు పెద్దపీట

◆ డివిజన్‌లో పనులకు రూ.2875.85 కోట్లు

◆ దక్షిణ కోస్తా రైల్వే, రాయగడకు కలిపి రూ.10 కోట్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ఈ నెల 1న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ తర్వాత పూర్తిస్థాయిలో కేటాయింపుల వివరాలను చూస్తే ఆంధ్రప్రదేశ్‌కు సుమారు రూ.8406 కోట్ల మేర నిధులు రానున్నాయి. వాల్తేరు రైల్వే డివిజన్‌కు మాత్రం పెద్దపీట వేశారని చెప్పొచ్చు. తూర్పు కోస్తా రైల్వేకు రూ.2857.85 కోట్ల నిధులను వివిధ పనుల కోసం కేటాయించారు. అయితే అందరూ ఎదురుచూస్తున్న సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌కు మాత్రం రూ.10 కోట్లే కేటాయింపులు చేయడం విచారకరం. అది కూడా రాయగడ నూతన డివిజన్ కేంద్రం కోసం కూడా దీన్నుంచే వినియోగించాలని సూచించినట్లు తెలుస్తోంది. వాస్తవానికి నూతన కార్యాలయానికి రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్లు గతంలోనే కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ శ్రీవైష్ణవ్ ప్రకటన చేశారు. శంఖుస్థాపనకు ఏర్పాట్లు చేశారు. దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ విశాఖకు ఇటీవల వచ్చిన సందర్భంలో దీనికి శంకుస్థాపన చేస్తారని

కేంద్ర పెద్దలు ప్రచారం చేసుకున్నారు. కానీ అలాంటిదేమీ జరగలేదు. రూ.10 కోట్లతో కొత్త రైల్వేజోన్ కార్యాలయ పనులు ఎలా సాధ్యమో కేంద్రం చెప్పాలి.

పలు ప్రాజెక్టులకు కదలిక

వాల్తేరు డివిజన్‌లో మౌలిక వసతుల కల్పన కోసం రూ.1717 కోట్లు వస్తాయని తెలుస్తోంది. రన్నింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయడం, కొత్త లైన్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వడం చేయనున్నారు. కొత్త లైన్ల నిర్మాణానికి రూ.285 కోట్లు, డబ్లింగ్ పనులకు రూ.2180 కోట్లు, ట్రాఫిక్ సౌకర్యాల మెరుగు కోసం రూ.51.13 కోట్లు, ట్రాక్ రెన్యువల్స్‌కు రూ.261.43 కోట్లు, సిగ్నల్ అండ్ టెలికాం పనులకు రూ.30.84 కోట్లు, మిగతా 2లో..

అల్పాదాయ వర్గాలను విస్మరించిన బడ్జెట్

అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటాచలం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలు అత్యంత నిరుత్సాహంగా ఉన్నాయని అఖిలభారత బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సిహెచ్. వెంకటాచలం అన్నారు. శనివారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అల్పాదాయ వర్గాలకు సమస్యలను, వాటికి పరిష్కారాలను బడ్జెట్ లో మిగతా 2లో..

అర్హులందరికీ పింఛన్లు అందాలి

▶ వార్త 2లో..

భూ సమస్యలకు సత్వర పరిష్కారం

▶ వార్త 2లో..

ఎపిలో నిజమైన మహిళా సాధికారత

▶ వార్త మెయిన్‌లో..

హైడ్రోపై ఆదివాసీల గర్జన

◆ ఏజెన్సీ జోలికొస్తే తరిమికొడతామని హెచ్చరిక

◆ రేగులపాలెంలో బహిరంగ సభ, ర్యాలీ

◆ విల్లంబులు ఎక్కుపెట్టిన మాజీ ఎంపీ మధు, గిరిజన నేతలు

సభలో మాట్లాడుతున్న మధు

ప్రజాశక్తి - అనంతగిరి

గిరిజన చట్టాలను ఉల్లంఘించి తమ మనుగడను ప్రశ్నార్థకం చేసే హైడ్రో పవర్ ప్రాజెక్టులను ఏజెన్సీలో పెడితే సంప్రదాయ ఆయుధాలతో తరిమి తరిమి కొడతామని పలువురు నేతలు, ఆదివాసీలు హెచ్చరించారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా అనంతగిరి మండలం పెదకోట పంచాయతీ పరిధి రేగులపాలెం గ్రామంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక కమిటీ శనివారం ఏర్పాటు చేసిన సభ విజయవంతమైంది. భారీగా గిరిజనులు తరలివచ్చారు. తొలుత ర్యాలీ నిర్వహించారు. ఈ బహిరంగ సభలో సిపిఎం మాజీ రాజ్యసభ సభ్యులు పి.మధు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదానీ గ్రూప్ ఆఫ్ కంపెనీకి చట్ట విరుద్ధంగా ఏకపక్ష నిర్ణయంతో కట్టబెట్టిన హైడ్రో పవర్ ప్రాజెక్టును అడ్డుకుని తీరుతామని స్పష్టం చేశారు. చట్టవిరుద్ధంగా రేగులపాలెం గ్రామంలో నిర్మించే హయ్యర్, లోయర్ హైడ్రో పవర్ ప్రాజెక్టు రద్దు కోసం రాష్ట్ర గవర్నర్, సిఎంలను కలిసి లిఖిత పూర్వకంగా విన్నవి స్తానన్నారు. తక్షణమే హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ప్రతిపాదనలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స మాట్లాడుతూ బాక్సైట్ పోరాటం మాదిరిగానే హైడ్రో ప్రాజెక్టు వ్యతిరేక పోరాటమూ ఉధృతమవుతోందన్నారు. అభివృద్ధి పేరిట అధికారులను రంగంలో దించి దొడ్డిదారిన సర్వేలు నిర్వహించి ప్రాజెక్టు పనులు చేపడితే సంప్రదాయ ఆయుధాలతో కంపెనీలను తరిమికొడతామన్నారు. ఇప్పటికే హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణ ప్రాంతాలైన ఎర్రవరం, చిట్టంపాడు. రేగులపాలెం గ్రామాల్లో పోరాటాలకు పదును పెట్టామన్నారు. సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా తీర్మానాలు చేసి, ఆమోదానికి జిల్లా పరిషత్, ఐటిడిఎ సమావేశాల్లో గళం విప్పుతానన్నారు. గిరిజన చట్టాలను తుంగలోకి తొక్కితే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు డి.వెంకన్న, సిపిఎం మండల కార్యదర్శి ఎస్.నాగులు, టోకూరు సిపిఎం సర్పంచ్ మొస్య, పెదకోట మాజీ సర్పంచ్ జంపరంగి దేముడు, నాయకులు జె.ఈశ్వరరావు, సింహాచలం, జి.ఆనంద్, ఎస్.దేముడు, రేగులపాలెం, మిగతా 2లో..

ఎయులో అక్రమాలపై విచారణ జరపాలి

◆ వీసీ ప్రసాద్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

◆ విద్యార్థి, యువజన సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎయులోని అక్రమాలపై విచారణ జరపాలని, వీసీ ప్రసాద్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి, యువజన సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఆంధ్రా యూనివర్సిటీ బాస్కెట్‌బాల్ గ్రౌండ్‌లో శనివారం ప్రత్యేక సమావేశం జరిగింది. ప్రసాద్‌రెడ్డి వీసీగా బాధ్యతలు చేపట్టిన నుంచి తీసుకొచ్చిన నూతన సంస్కరణల ఫలితాలపై మిగతా 2లో..

12వ వార్సికోత్సవ శుభాకాంక్షలు

Estd.2011

శ్రీ విద్యా ఇంగ్లీషు మీడియం స్కూల్

విధేయతే విజయం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే గుర్తింపు పొందిన పాఠశాల

LKG to 10th Class

కార్యసాధన, అకుంఠిత దీక్ష,
పట్టువిడువని ప్రయత్నం, అసాధ్యాన్ని
సుసాధ్యం చేసి మీ పిల్లల బంగారు భవిష్యత్తుకు,
ఉజ్వల భవితకు బరోసా కేవలం శ్రీ విద్యాతోనే సాధ్యం

2023-24 Admissions are in Open

అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యాభోదన

బస్సు సౌకర్యం కలదు.

కరస్పాండెంట్ కె.వంశీ

ఆర్.కె.హస్పిటల్ రోడ్ లైను, ఈ-సేవ కేంద్రం వద్ద, చిన్నగంట్యాడ, గాజువాక - 26

సెల్ : 77948 28914, 77948 28915

మొదటి పేజీ తరువాయి..

వాల్తేరుకు పెద్దపీట

రహదారి భద్రత, ఆర్‌ఒబిలకు రూ.16.96 కోట్లు, వంతెన పనులకు రూ.9.93 కోట్లు, వర్క్‌షాప్‌లు, ప్రొడక్షన్ యూనిట్లకు రూ.2.56 కోట్లు, ఇతర పనులకు రూ.12.1 కోట్లు, మెషినరీ ప్లాంట్లకు రూ.1.62 కోట్లు కేటాయింపులు జరిగాయి. కొత్త లైన్లు జైపూర్ నుంచి మల్కన్ గిరికి రూ.135 కోట్లు, జైపూర్ నుంచి నవరంగపూర్‌కు రూ.100 కోట్లు, నౌపాడ గుణుపూర్ కొత్త బ్రాడ్ గేజ్ లైన్ తిరువెళి వరకు రూ.50 కోట్లుతో ఏర్పాటు కానున్నాయి. డబ్లింగ్ పనుల విషయానికొస్తే కిరండోల్-జగదల్‌పూర్‌కు రూ.135 కోట్లు, జగదల్‌పూర్-కోరాపుట్‌కు రూ.170 కోట్లు, విజయనగరం- సంబల్‌పూర్ మూడో లైన్‌కు రూ.920 కోట్లు, కొత్తవలస-కోరాపూట్‌కు రూ.410 కోట్లు, కోరాపూట్-సింగాపూర్ రోడ్డుకు సుమారు రూ.500 కోట్లు కేటాయింపులు చేశారు. ట్రాఫిక్ సౌకర్యాల మెరుగు కోసం సింహాచలం నార్త్ నుంచి గోపాలపట్నం యార్డు వరకు రూ.7.5 కోట్లతో పనులు చేపట్టనున్నారు. చీపురుపల్లి ఎల్ 4 కన్వర్షన్‌కు రూ.84.54 లక్షలు, గోపాలపట్నం -విజయనగరం ఆటో సిగ్నలింగ్, సింహాచలం బైపాస్‌కు రూ.32.78 కోట్లు, కోచింగ్ కాంప్లెక్స్‌కు రూ.10 కోట్లు, వాల్తేరు డివిజన్ ట్రాక్ రెన్యువల్స్ కోసం రూ.25 కోట్లు, పలాస-విశాఖపట్నం-దువ్వాడలకు రూ.40 కోట్లు, కోరాపుట్-సింగపూర్ రోడ్డుకు రూ.20.01 కోట్లు, వాల్తేరు మార్షలింగ్ యార్డుకు 1.01 కోట్లు, సింగపూర్ రోడ్డు - విజయనగరానికి రూ.25 కోట్లు కేటాయించారు.

హైడ్రోపై ఆదివాసీల గర్జన

కుడియా, తమటు, పెదకోట, పిన్నకోట, కొండిబ కోట తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ప్రమాదంలో గిరిజనుల జీవన మనుగడ

పాడేరు : రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల గిరిజనుల జీవన మనుగడ ప్రమాదంలో పడిందని మాజీ ఎంపీ పి.మధు అన్నారు. స్థానిక అటవీ శాఖ అతిథి గృహంలో శనివారం ఉదయం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు జరగకపోవడంతో రాష్ట్రం వెనుకబడిపోయిందన్నారు. వైసిపి పాలన అధ్వానంగా ఉందన్నారు.

అల్పాదాయ వర్గాలను విస్మరించిన బడ్జెట్

ఏమాత్రమూ ప్రతిపాదించలేదని తెలిపారు. సంపన్న వర్గాలపై పన్ను విధించకపోవడం, వారిపైగల పన్ను తగ్గింటం చూస్తే వారు మరింత సంపన్నులు కావడానికి ఈ బడ్జెట్ దోహదపడుతోందని అర్థమవుతోందన్నారు. .దేశంలో నిరుద్యోగ రేటు శాతం 8.3 పెరగటం ఆందోళన కలిగించే విషయం అయినప్పటికీ ఈ బడ్జెట్‌లో వారికి ఉద్యోగాలు కల్పన ప్రస్తావన లేకపోవడం చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షులు టి.రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి బిఎస్.రాంబాబు, సంయుక్త కార్యదర్శి పివి.కృష్ణారావు పాల్గొన్నారు.

ఎయులో అక్రమాలపై విచారణ జరపాలి

చర్చించారు. ఈ విధానాలు విద్యార్థులకు, పరిశోధకులకు, అధ్యాపక, అధ్యాపకేతరులకు, ఉత్తరాంధ్ర ప్రజలకు తీవ్ర అన్యాయం చేసే విధంగా ఉన్నాయని తెలిపారు. ప్రసాద్ రెడ్డి అక్రమాలను, అన్యాయాలను ప్రశ్నిస్తున్న వారిపై తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని తెలిపారు. యూనివర్సిటీ ఉద్యోగులను ఉపయోగించి చట్ట విరుద్ధంగా వాటర్, ఎలక్ట్రిసిటీ కనెక్షన్లు తొలగించటంలాంటి నీచమైన పనులకు దిగజారిపోవడం హేయమైన చర్యని పేర్కొన్నారు. వీసీని రీకాల్ చేసి, చట్టానికి పట్టించే వరకూ ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. విశాఖలో పలు అభ్యుదయ, ప్రగతిశీల సంఘాలను కలుపుకుని పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ ఎయు కమిటీ నాయకులు బి.గౌతమ్, సూర్య, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు ఫణీంద్ర, నాగరాజు, పిడిఎస్‌ఒ నాయకులు విశ్వనాథ్, సురేష్, ఎఐడిఎస్‌ఒ నాయకులు అభిలాష్, రవి, పిడిఎస్‌యు నాయకులు అర్జున్, ఉత్తరాంధ్ర నిరుద్యోగ జెఎసి నాయకులు పైడిరాజు, ఎస్‌టిఎఫ్ నాయకులు శోభన్ కుమార్, డివైఎఫ్ఐ నాయకులు రాజు, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు రాంబాబు, ఎయు ప్రొఫెసర్స్ ఫోరం నుంచి పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, మధురవాడ

రాష్ట్రంలో భూ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నామని, అందులో భాగంగా ప్రాంతీయ రెవెన్యూ అధికారుల సదస్సు నిర్వహిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు పేర్కొన్నారు. విశాఖలోని ఓ హోటల్‌లో శనివారం ఉదయం ఉత్తరాంధ్ర జిల్లాల రెవెన్యూ అధికారుల కాన్ఫరెన్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే తిరుపతి, విజయవాడల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామని తెలిపారు. భూమి రాష్ట్రాభివృద్ధిలో ప్రధాన వనరని అన్నారు. ఈ వనరు విషయమై కాలానుగుణంగా అనేక సాంకేతిక మార్పులు వచ్చాయన్నారు. భూమిని యజమాన్యం చేస్తున్న రెవెన్యూ శాఖ ఎప్పటికప్పుడు వస్తున్న కాలానుగుణ మార్పులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత నిబంధనలను, చట్టాలను మార్పు చేసుకుని ముందుకు వెళ్లవలసిన అవసరం ఉందన్నారు. వాటిపై చర్చించుకునేందుకు ఈ సదస్సు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం భూ సర్వేను వేగవంతం చేశామన్నారు.

ఇటుక పేర్చింది లేదు.. ప్రేలాపనలా ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'అత్త తెడ్డు నాకేసి కోడలికి బుద్ధి చెప్పినట్లుంది'.. బిజెపి నేతల నీతి. ఏడు సంవత్సరాలుగా విశాఖలోని ఇఎస్‌ఐ ఆసుపత్రికి నిధులిచ్చిందీ లేదు... ఇటుక పేర్చిందీ లేదు. కానీ ఉత్తరప్రదేశ్ నుంచి బిజెపి రాజ్యసభ సభ్యుడైన జివిఎల్ నరసింహారావు ప్రేలాపనలు చూసిన ఎవరికైనా ఈ ప్రాంతం పట్ల వారు ఎలాంటి నిర్లక్ష్యం చూపుతున్నారో ఇట్టే అర్థమవుతుంది. షీలానగర్‌లో నూతనంగా నిర్మించనున్న ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఇఎస్‌ఐసి) ఆసుపత్రికి పునాది రాయి వేశారంతే. ఒక్క పనీ కేంద్రం చేపట్టలేదు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మీద ఆ నెపం మోపుతూ 500 పడకల ఆసుపత్రికి రాష్ట్ర ప్రభుత్వం భూమిని కేటాయించలేనందున 350 పడకలకు కుదించడం జరిగిందంటూ జివిఎల్ చెప్పడం చూస్తే 'దెయ్యాలు వేదాలు వల్లించడమే' అవుతోంది. కేంద్ర కార్మిక శాఖ మంత్రి రామేశ్వర్ తేలిని ఇటీవల రాజ్యసభలో ప్రశ్నించిన జివిఎల్‌కు ఆయన పై విధంగా 150 పడకలను కుదిస్తున్నట్లు చెప్పడం విశేషం. సిబ్బంది క్వార్టర్లకు స్థలం అందుబాటులో లేనందున 50 పడకల సూపర్ స్పెషాల్టీ సౌకర్యాలతో 350 పడకల ఆసుపత్రిగా మార్చారని తెలిపారు.

20 లక్షల మందికి వైద్యం ఎక్కడ ?

ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ఉద్యోగులు ఆసుపత్రి సదుపాయాల్లేక ప్రైవేట్ ఆసుపత్రుల చుట్టూ తిరగలేక అల్లాడిపోతున్నారు. 2016లో కేంద్రంలోని బిజెపి సర్కారు నగరంలోని షీలానగర్‌లో ఎనిమిదిన్నర ఎకరాల్లో ఆసుపత్రికి పూనుకుంది. నాటి పెద్దలు ఎం.వెంకయ్యనాయుడు, బండారు దత్తాత్రేయ, నాటి విశాఖ ఎంపీ కంభంపాటి హరిబాబు పునాదిరాయి వేసి ఆ తర్వాత పూర్తిగా ఆసుపత్రి విషయాన్ని గాలికి వదిలేశారు. ఈ పాపం బిజెపిదే. 2023 వరకూ ఒక్క ఇటుకా పేర్చకుండా తాజాగా రాష్ట్ర ప్రభుత్వానిది మాత్రమే తప్పంతా అన్నట్లుగా జివిఎల్ పత్రికల్లో ప్రచారం పొందే

యత్నాలకు దిగుతున్నారు. విశాఖ ఎంపీగా బిజెపి తరపున 2024 ఎన్నికల్లో పోటీకి సై అంటోన్న జివిఎల్ ఈ తరహా కుటిలయత్నాలకు దిగుతున్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రమాదంలో పడేసే బిజెపి విధానం పట్ల విశాఖ, ఉత్తరాంధ్ర ప్రజానీకం తీవ్ర వ్యతిరేకతతో ఉన్న ప్రస్తుత తరుణంలో నగరంలో పలుచోట్ల పర్యటనలతో హల్‌చల్ చేయడం విమర్శలకు తావిస్తోంది. 20 లక్షల మంది ఉద్యోగుల కుటుంబ సభ్యులకు మేలుచేసే ఇఎస్‌ఐ ఆసుపత్రి నిర్మాణానికి ఎనిమిదిన్నర ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే సిద్ధం చేసింది. రూ.500 కోట్లు కేంద్రం ఇవ్వాల్సి ఉండగా నిధులివ్వకుండా తీవ్ర తాత్సారం చేస్తోంది. రూ.380 కోట్ల వరకూ 2022లో కేటాయించినట్లు కేంద్రం ప్రకటించినా అక్కరకు రాని స్థితి కొనసాగుతోంది.

బిజెపి విధానంతోనే నష్టం

టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాల్సిన బిజెపి తీవ్ర నిర్లక్ష్యంతో వ్యవహరించడం ఇఎస్‌ఐ విషయంలో బట్టబయలైంది. ప్రస్తుతం ఇఎస్‌ఐ ఆసుపత్రి సింధియా గేటు వద్ద మల్కాపురంలో నడుస్తోన్న సంగతి తెలిసిందే. ఇది నిర్మాణం జరిగి 40 ఏళ్లు దాటడంతో శిథిలావస్థకు చేరింది. మళ్లీ మరమ్మతులు చేశారు. 1976లో ఏర్పాటైనప్పుడు ఎంతమంది వైద్యులు ఉండేవారు నేడూ అదే పరిస్థితి. అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఉన్నా వారి సేవలతో ఉద్యోగులు పూర్తి స్థాయిలో సంతృప్తిని వ్యక్తం చేయడం లేదు. ఈ ఆసుపత్రి ఆధునీకరణ కోసం 2021లో సిఐటియు పోరాటాల ఫలితంగా రూ.21.79 కోట్ల నిధులు వచ్చాయి. దీంతో ఆసుపత్రిలో కొన్ని మౌలిక వసతులు, విస్తరణ పనులు జరిగాయి. 125 బెడ్స్‌తో ఇది నడుస్తున్నా... వసతుల కొరత ఇంకా వెంటాడుతోంది. షీలానగర్ వద్ద ఎనిమిదిన్నర ఎకరాల్లో పూర్తిస్థాయి ఆసుపత్రి నిర్మాణం జరగనిదే ఇఎస్‌ఐ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు సరైన వైద్యం అందే స్థితి లేదు. కేంద్రంలోని బిజెపియే చొరవ చేయాల్సి ఉండగా రాజకీయాల కోసం రాష్ట్ర ప్రభుత్వాన్ని నిందిస్తూ జివిఎల్ వంటి వారు పబ్బం గడుపుకోవాలని చూడడం విచారకరం.

అర్హులందరికీ పింఛన్లు అందాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అర్హులైన వారందరికీ పింఛన్లు అందాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర పేర్కొన్నారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 1 నుంచి 7 స్థాయీ సంఘాల సమావేశాలు ఆమె అధ్యక్షతన జరిగాయి. ప్రణాళిక, ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, విద్య, వైద్య సేవలు, మహిళా సంక్షేమం, నిర్మాణపు పనులకు సంబంధించి వారి వారి మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన వారందరికీ పింఛన్లు అందడంలేదని, దానికిగల కారణాలు డిఆర్‌డిఎ ప్రొజెక్టు డైరెక్టరును అడిగి తెలుసుకున్నారు. కళ్యాణమస్తు పథకం గురించి వివరించి అవగాహన కల్పించాలని సూచించారు. హౌసింగ్ విభాగానికి సంబంధించి జగనన్న కాలనీలు మార్చి 31వ తేదీకి నిర్మాణాలు పూర్తి చేసి, గృహ ప్రవేశాల కోసం సిద్ధం చేయాలని హౌసింగ్ అధికారులకు ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీరామమూర్తి, డిప్యూటీ సిఇఒ సత్యనారాయణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జి-20 సమ్మిట్‌కు జివిఎంసి గెస్ట్ హౌస్ సిద్ధం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కిర్లంపూడి లే అవుట్‌లోగల మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ గెస్ట్ హౌస్ ఇకపై జి-20 సెక్రటేరియేట్ వేదిక కానుందని, శనివారం రాష్ట్ర ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వై.శ్రీలక్ష్మి స్మార్ట్ సిటీ నిధులతో పునర్నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ గెస్ట్ హౌస్‌ను ప్రారంభించారని కమిషనర్ పి.రాజాబాబు తెలిపారు.

సెంట్రల్ బ్యాంక్ ఆధ్వర్యాన సన్మాన్ దివస్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం శాఖలో 'సన్మాన్ దివాస్' నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు అన్ని శాఖలలో ఉన్న బ్యాంకు రిటైర్డు పెన్షనర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విశాఖపట్నం రీజనల్ హెడ్ నరేష్ కుమార్ అహిర్వార్, విశాఖపట్నం శాఖ చీఫ్ మేనేజర్ వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్‌ను సత్కరిస్తున్న అధికారులు

674వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం 22 వేల ఎకరాల భూములను ఇచ్చిన రైతులలో ఈనాటికీ 8,500 మందికి ఉపాధి లభించలేదని ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు వై.కొండయ్య అన్నారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన ఉక్కు దీక్షలు శనివారం నాటికి 674వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, AT: VISAKHAPATNAM
O.S.1689/2022

Between :
State Bank of India, SME Centre, Visakhapatnam, Rep. by its Manager ...Plaintiff
And
M/s. Sai Nikhitha Cell Point, Rep. by its Prop: Sri Eppili Prasad and another ...Defendants

SUMMONS

To,
D-1 : M/s. Sai Nikhitha Cell Point, Rep. by its Proprietor Sri Eppili Prasad, S/o.E.Syamasundara Rao, D.No. 64-1-41/1,Near Bus Stop, Main Road, Shriharipuram, Visakhapatnam-11
D-2 : Sri Eppili Prasad, S/o. E. Syamasundara Rao, age 43 years, R/at. D.No.64-1-41/1, Near Bus Stop, Main Road, Shriharipuram, Visakhapatnam-11.

Please take notice that the above plaintiff bank has filed the suit against the defendants for recovery of an Cash Credit Loan amount of Rs.11,98,778/- and FITL Loan amount Rs.1,70,613/- i.e total due amount of **Rs.13,69,391/-** (Rupees: Thirteen Lakhs sixty nine thousand three hundred and ninety one only) and other reliefs. The above suit stands posted to **16-03-2023** for your appearance either in person or through a Pleader on the above said date i.e., **16-03-2023** in the said Court at **10:30 A.M** to answer the claim, failing which the matter will be disposed as per law.

P. SATYA SRINIVAS, Advocate, Visakhapatnam. **Cell: 9247238678.**

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, AT : VISAKHAPATNAM
O.S.1691/2022

Between :
State Bank of India, SME Centre, Visakhapatnam, Rep. by its Manager ...Plaintiff
And
M/s.J.M.TRADERS, Rep. by its Prop: Sri Mukundu Mahendra and another ...Defendants

SUMMONS

To,
D-1 : M/s. J.M. TRADERS, Rep. by its Proprietor: Sri Mukundu Mahendra, S/o. M. Ramana Reddy, # 29-6-3/3, 2nd Floor, Hotel Amaravathi Lane, Lalitha Nagar Colony, Dabagardens, Visakhapatnam-20
D-2 : Sri Mukundu Mahendra, S/o. S/o. M. Ramana Reddy, Hindu, aged about 33 years, R/at.D.No. 29-6-3/3, 2nd Floor, Hotel Amaravathi Lane, Lalitha Nagar Colony, Dabagardens, Visakhapatnam-20

Please take notice that the above plaintiff bank has filed the suit against the defendants for recovery of an Cash Credit Loan amount of Rs.11,46,198/- and FITL Loan amount Rs.1,66,586/- i.e total due amount of **Rs.13,12,784/-** (Rupees: Thirteen Lakhs twelve thousand seven hundred and eighty four only) and other reliefs. The above suit stands posted to **16-03-2023** for your appearance either in person or through a Pleader on the above said date i.e., **16-03-2023** in the said Court at **10:30 A.M** to answer the claim, failing which the matter will be disposed as per law.

P. SATYA SRINIVAS, Advocate, Visakhapatnam. **Cell: 9247238678.**

IN THE HON'BLE COURT OF THE II ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
I.P. 47/2022

Between :
Narayanasetty Annaji Rao, S/o.late Krishna Murthy, age 54 years, R/at.Chandakaveedhi, Near Ramalayam, Jagadamba Junction, Visakhapatnam ...Petitioner
And
Tekmudei Prasad & others ...Respondents

GENERAL NOTICE

The public are hereby informed that the above petitioner filed the above I.P.No.47/2022 on the file of the Hon'ble II Addl. Senior Civil Judge Court, at Visakhapatnam to declare him as an insolvent and the matter stands posted to **07-02-2023** for hearing. So public are hereby informed that any objections can be raised in the above case before the Hon'ble Court on **07-02-2023** either in person or through an Advocate at **10:30 A.M.**

(By the Order of the Hon'ble II Addl. Senior Civil Judge Court, At Visakhapatnam)
S. SUBBI REDDY,
D.S. RAMA RAJU
Advocates, Visakhapatnam,
Cell: 9866465979.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
E.P.120/2017 in O.S.400/2008

Between:
Sri Muvvala Papa Rao & another ...D.Hrs.
And
Sri Ommi Krishna (Died) & others ... J.Drs.

RULE 34 NOTICE

To
6th J.Dr.:
Smt. Yellankey Rama, d/o.late Krishna, Hindu, aged not known to the D.Hrs, residing at 50-7-19, Naidu Street, Seethamma Peta, Visakhapatnam

Whereas the above D.Hrs. have filed the above E.P. against you and others for the reliefs mentioned therein. Where as it is found to the satisfaction of Honourable Court that you have been evading consistently the receipt of summons in the above proceedings. Hence, the Honourable Court was pleased to direct substitute service of summons to you by way of publication in this newspaper.

Take notice that in the above proceedings you are hereby directed to appear before the Honourable Principal Senior Civil Judge Court, Visakhapatnam. **on 01-03-2023 at 10.30 A.M** either in person or through an Advocate failing which the hearing will take place in your absence.

(By order of the Hon'ble Court)
Tatavarthy Law Chambers (TLC)
T.V.S.K. KANAKA RAJU
M.A.S.PRABHA,
Advocates, Visakhapatnam

పిల్లలు విద్యకు దూరం కాకూడదు : డిఇఒ

సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ చంద్రకళ

ప్రజాశక్తి-పద్మనాభం : 6 నుంచి 14 సంవత్సరాలు వయసున్న పిల్లలు విద్యకు దూరం కాకూడదని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ పేర్కొన్నారు. పాండ్రంగిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. పాఠశాలకు విద్యార్థిని హాజరుకాకపోవడాన్ని గమనించారు. పాఠశాలకు రాని విద్యార్థిని ఇంటికి వెళ్లారు. ఇంటి వద్ద లేకపోవడంతో ఆరా తీసారు. గ్రామానికి సమీపంలో ఉన్న ఇటుక బట్టీలో పని చేస్తోందని తెలుసుకొని అక్కడికి వెళ్లారు. విద్యార్థిని అక్కడ ఇటుకలు తయారీ పనిలో ఉండటాన్ని గమనించారు. సమీపంలో ఉన్న ఇటుక బట్టీలను కూడా పరిశీలించారు. ఒడిశాకు చెందిన విద్యార్థులు కూడా అక్కడ ఉండటాన్ని గమనించారు. ఇటుక బట్టీలు ఎన్ని ఉన్నాయని ఆరా తీశారు. సుమారు 300 ఇటుక బట్టీలు ఉన్నట్లు తెలుసుకున్నారు. వెంటనే ఇటుక బట్టీల నిర్వాహకులతో సమావేశం నిర్వహించాలని ఎంపిపికె.రాంబాబు, జెడ్‌పిటిసి సుంకర గిరిబాబును కోరారు. దీనిపై శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో సమావేశం ఏర్పాటుచేశారు. బడిఈడు పిల్లలను పాఠశాలకు పంపించే బాధ్యత మన అందరిపైనా ఉందని, దీనికి సహకరించాలని నిర్వాహకులను డిఇఒ కోరారు. దీనిపై నిర్వాహకులు స్పందిస్తూ ఒడిశా విద్యార్థుల కోసం పదేళ్ల నుంచి ప్రత్యేక పాఠశాల ఏర్పాటుచేసి 50 మందికి విద్య అందిస్తున్నట్లు తెలిపారు. దీనిపై డిఇఒ మాట్లాడుతూ, అన్ని ఇటుక బట్టీలలో ఉన్న విద్యార్థులూ ఈ పాఠశాలకు వచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులు, మధ్యాహ్న భోజనం ఏర్పాటు తదితరాలపై కలెక్టర్‌తో మాట్లాడి చర్యలు చేపడతానని డిఇఒ హామీ ఇచ్చారు. సోమవారం నాటికి విద్యార్థుల ఆధార్ నెంబర్లతో వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి దుస్తులు, పుస్తకాలు, పలకలు, ఆట వస్తువులు సమకూరుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎపిసి బి.శ్రీనివాసరావు, డిప్యూటీ డిఇఒ ఎ.గౌరీశంకరరావు, డైట్ లెక్చరర్ గోట్టి రవి, ఆల్టర్నేట్ స్కూల్ కో-ఆర్డినేటర్ ఎ.శైలజ, ఎంఇఒ శివరాణి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 96వ వార్డు పరిధి పెందుర్తిలో యువకుడు మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అరవింద్‌స్వామి సెంథిల్ కుమార్ (26) శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఫ్యానుకు ఉరివేసుకునానరు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సిమెంట్ బెంచీల వితరణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి 4వ వార్డు పరిధి తిమ్మాపురంలో ఉన్న ఎన్‌డిఆర్‌ఎఫ్ (జాతీయ విపత్తుల స్పందన దళం) కార్యాలయానికి దివీస్ సిఎస్ఆర్ నిధులు రూ 1.35 లక్షలతో సిమెంట్ బెంచీలు అందజేశారు. దివీస్ సేఫ్టీ ఆఫీసర్ ఎం.చంద్రశేఖర్, ఎన్‌డిఆర్ఎఫ్ అధికార్లు ఫోబిన్ పోకాన్, జి.ఈశ్వరరావు, సిఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, ప్రతినిధులు శేఖర్‌బాబు, పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న డైరెక్టర్ రామలక్ష్మణరావు

పింఛను మంజూరు నిబంధనలు సడలింపునకు వినతి

ప్రజాశక్తి -తగరపువలస : 50 ఏళ్ళు పైబడిన చేనేతలకు పింఛను మంజూరులో నిబంధనలు సడలించాలని కోరుతూ ఎపి పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మిన రామ లక్ష్మణరావు, కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. విజయవాడలోని గొల్లపూడి, బిసి భవన్‌లో పద్మశాలి కార్పొరేషన్ చైర్ పర్సన్, డైరెక్టర్లు, ఉన్నతాధి కారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చేనేత కార్మికులు, కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలపై చైర్ పర్సన్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేసినట్లు కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మిన రామలక్ష్మణరావు తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సవ్వారు (పట్టి) నేత పని వారలకు నేతన్న నేస్తం పథకం వర్తింపజేయాలని, చేనేత వృత్తి గిట్టుబాటు కాక పోవడంతో ఉపాధి కోసం వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వలసల నివారణకు వృత్తి శిక్షణా కేంద్రాలు ఏర్పాటుచేయాలని, స్టైఫండ్ ఇవ్వాలని, విశాఖ జిల్లాలో సామాజిక భవనానికి ప్రభుత్వ స్థలం మంజూరు చేయాలని కోరారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో జగదీష్‌వర్మ తదితరులు

లిటిల్ స్టెప్స్ స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-పిఎం పాలెం : పిఎం.పాలెం సమీపంలో ఉన్న శ్రీ శౌర్య ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన లిటిల్ స్టెప్స్ స్కూల్ 7వ వార్షికోత్సవాన్ని శిల్పారామం కల్యాణ మండపంలో నిర్వహించారు. అధ్యక్షులు జగదీష్‌వర్మ, కార్యదర్శి శైలజ, ప్రధానోపాధ్యాయులు ప్రవీణలక్ష్మి ఆధ్వర్యాన వార్షిక రిపోర్టును చదివి వినిపించారు. తమ పాఠశాల కార్యాచరణాత్మకంగా విద్య నందిస్తున్నదన్నారు. ప్రత్యేక అతిథులుగా రాజీవగాంధీ మానవసేవ అవార్డు గ్రహీత, గాయత్రి వెల్ఫేర్, కల్చరల్ యూత్ అకాడమీ అధ్యక్షుడు రూపాకుల రవికుమార్, విశ్రాంత స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ సాలూరు వెంకటేశ్వరరావు, విశ్రాంత ఉప కలక్టర్ అల్లూరి సుబ్బరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, చిన్న వయసు నుంచి పాఠ్యాంశాలతో పాటు మనసులో నాటుకున్న లలిత కళ, క్రీడాభావం, సేవాదృక్పథం, నైతిక విలువలు నేర్పడం ద్వారా సమాజానికి మంచి ఫలాలనిస్తుందన్నారు. చిన్నారుల నృత్యాలు, వివిధ సందేశాత్మక అంశాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ అంశాలలో ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు, పతకాలు, సర్టిఫికెట్లను అందజేశారు.

బీచ్‌లో వ్యర్థాలను సేకరిస్తున్న విద్యార్థులు

సాగర్‌నగర్ బీచ్‌లో స్వచ్ఛ భారత్

ప్రజాశక్తి -మధురవాడ : ప్లాస్టిక్ ఫర్ చేంజ్ ఆధ్వర్యాన శనివారం సాగర్‌నగర్ బీచ్‌లో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. తీర ప్రాంతాలలో ఉన్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పిఎఫ్‌సి సోర్టింగ్ టీమ్ కె.జగదీష్, విశాఖ ఉమెన్స్ కాలేజీ డిగ్రీ విద్యార్థులు, బాలుర వసతి హాస్టల్ డిగ్రీ విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు ఎల్.అర్జున్, ది బానియన్ సంస్థ ప్రతినిధులు ఎం.నిరుపమ సేకరించారు. ముందుగా ప్లాస్టిక్ ఫర్ చేంజ్ (పిఎఫ్‌సి) ఉద్దేశాన్ని ప్రోగ్రాం కో-ఆర్డినేటర్లు ఎస్.సత్యవేణి, సంతోషి వివరించారు. ఒక్కసారి ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ చేస్తూ ప్రపంచ బ్రాండ్లు కలిగిన కంపెనీలు నైతిక విలువలతో కూడిన నాణ్యమైన ప్లాస్టిక్‌ను సమాజానికి అందించుటలో పిఎఫ్‌సి సహకరిస్తుందని తెలియజేశారు.

గురుకుల విద్యార్థులకు వైరల్ జ్వరాలు

ప్రజాశక్తి - ఆరిలోవ : శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు గత కొన్ని రోజులుగా వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. విద్యార్థులకు స్థానిక ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో చికిత్స చేయిస్తున్నారు. కొంత మందికి తగ్గక పోవడంతో తల్లిదండ్రులను పిలిపించి ఇళ్లకు పంపిస్తున్నారు. పాఠశాలలో మంచినీటి ట్యాంకు శుభ్రంగా లేకపోవడంతోనే ఈ జ్వరాలు రావడానికి కారణం కావచ్చని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీంతో పాఠశాల ప్రిన్సిపల్ హడావిడిగా పూర్తిగా నాచుపట్టి ఉన్న ట్యాంకును శుభ్రం చేయించినట్లు సమాచారం.

అనంతుని కల్యాణోత్సవం విరాళాల సేకరణపై సమావేశం

ప్రజాశక్తి-పద్మనాభం : ఏటా మార్చి మొదటి వారంలో జరుగుతున్న అనంత పద్మనాభస్వామి కల్యాణోత్సవానికి దాతల నుంచి విరాళాలు సేకరణపై అలయం ఇఒ నానాజీబాబు ఆధ్వర్యాన శనివారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపిపి కె.రాంబాబు హాజరయ్యారు. కల్యాణోత్సవం నిర్వహణ, విరాళాలపై చర్చించారు. ఈ ఏడాది కల్యాణోత్సవం ఆర్భాటంగా నిర్వహించాలని, అందుకు అవసరమైన నిధులు ముందుగానే దాతలు, భక్తుల నుంచి సేకరించాలని సమావేశంలో నిర్ణయించారు. పద్మనాభం, కృష్ణాపురం గ్రామాల్లో ఉన్న రైతులు కూడా దేవాలయం అభివృద్ధికి సహకరించాలని కోరారు. మార్చి 3వ తేదీన జరిగే కల్యాణంలో అనంతుని సన్నిధిలో దంపతులు కూర్చొనేందుకు రూ.20 వేలు చొప్పున చెల్లించాలని నిర్ణయించారు. సాధారణంగా వచ్చే భక్తులకు రుసుం నిర్ణయించలేదు. ఈ ఏడాది కొత్తగా స్వామి కల్యాణం తరువాత తారు రోడ్డుకు పక్కనే ఉన్న కన్నయ్య కోనేరులో తెప్పోత్సవం నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. సుమారు 100 సంవత్సరాలు క్రితం నిర్మించిన తెప్పోత్సవాన్ని ఈ ఏడాది పునరుద్ధరించాలని, దాని నిమిత్తం కన్నయ్య కోనేరును అభివృద్ధి చేయడానికి ఏర్పాటుచేయాలని సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో భక్తులు రామకృష్ణ, ప్రసాద్, సన్యాసినాయుడు, పద్దు, ఎర్రినాయుడు, వెంకటరావు, నరసింహనాయుడు, రవికుమార్, అప్పారావు, శ్రీను తదితులు పాల్గొన్నారు.

లక్ష్యం ఉన్నతంగా ఉండాలి

ప్రజాశక్తి - తగరపువలస : ఎంచుకున్న లక్ష్యం ఉన్నతంగా ఉండాలని ఎయు కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రొఫెసర్ వై.రాజేంద్రప్రసాద్ విద్యార్థులకు సూచించారు. స్థానిక అవంతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విద్యార్థుల ఇండక్షన్ మీట్, ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేంద్ర ప్రసాద్ హాజరై మాట్లాడారు. ఫ్రెషర్స్ డే ప్రాముఖ్యతను వివరించారు. ఫార్మసీ రంగంలో మెరుగైన వేతనాలతో కూడిన ఉన్నతమైన ఉద్యోగాలు లభిస్తాయని స్పష్టం చేశారు. ఎఐపిఎస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎంబివి.రాజు మాట్లాడుతూ, ఫార్మసీ విభాగంలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, వనరులు తదితర అంశాలను వివరించారు. అరబిందో ఫార్మా లిమిటెడ్ ఒంగోలు క్లస్టర్ హెడ్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ శేషసాయి, ఎఐపిఎస్ పూర్వ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ వి.ఉమా శంకర్, తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్

క్రీడల పట్ల ఆసక్తి అవసరం : మేయర్

విద్యార్థిని అభినందిస్తున్న మేయర్

ప్రజాశక్తి - ఆరిలోవ : విద్యార్థి దశ నుంచే క్రీడల పట్ల ఆసక్తి కలిగి ఉండాలని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. రాజమండిలో జరిగిన స్టేట్ లెవెల్ బాక్సింగ్ పోటీలలో తోటగరువు ప్రభుత్వ పాఠశాల నుంచి హాజరై గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థి వడ్డాది హేమంత్‌ను ఆరిలోవలోని క్యాంప్ కార్యాలయంలో మేయర్ శనివారం అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, విద్యార్థుల క్రీడల పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తోడ్పాటునందించాలని కోరారు. 7వ తరగతి విద్యార్థి హేమంత్‌కు 32 కేజీల బాక్సింగ్ పోటీలలో స్టేట్ లెవెల్‌లో గోల్డ్ మెడల్ సాధించడం సంతోషంగా ఉందన్నారు. వారికి తర్ఫీదునిచ్చిన కోచ్‌లను మేయర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భవాని, కోచ్‌లు బంగార్రాజు, రామారావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన ర్యాలీలు

ప్రజాశక్తి-యంత్రాంగం

అంతర్జాతీయ కేన్సర్ దినోత్సవం సందర్భంగా జిల్లాలో పలుచోట్ల శనివారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

మాధవధార : మాధవధార ప్రాంతంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రైవేట్ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి మూల దీపేష్ ఆధ్వర్యాన అవగాహనా ర్యాలీ నిర్వహించారు. పొగాకుకు దూరంగా ఉండటం, ఆల్కహాల్‌ను పరిమితం చేయడం, చర్మాన్ని రక్షించుకోవడం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లతో కేన్సర్ వచ్చే ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని ప్లకార్డులు పట్టుకుని నినదించారు. ఈ సందర్భంగా మూల దీపేష్ మాట్లాడుతూ, జీవనశైలి మార్పులు, రెగ్యులర్ తనిఖీలు, ముందస్తుగా కేన్సర్‌ను గుర్తించడం చేస్తే ప్రపంచవ్యాప్తంగా 40 శాతం కేన్సర్ మరణాలను నివారించవచ్చని తెలిపారు. దీపేష్ తండ్రి మూల వెంకటరావు మాట్లాడుతూ, కరోనా సమయంలో గ్లౌజులు, శానిటైజర్లు, మాస్కులను దీపేష్ పంపిణీచేశారని తెలిపారు.

ఆరిలోవ : విండ్రా సూపర్ స్పెషాలిటీ అండ్ కేన్సర్ రీసెర్చ్ హాస్పిటల్, ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ముడసర్లోవ పార్కు రోడ్డులో కేన్సర్‌పై అవగాహన కల్పించారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రాంతం నుంచి చినగదిలి సాయిబాబా ఆలయం వరకు వాక్ థాన్ నిర్వహించారు. ఈ ర్యాలీలో డాక్టర్ వంశీధర్ పుత్రవేవు, డాక్టర్ సయ్యద్ యాసర్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మూర్తి, కార్యదర్శి ఈశ్వరరావు, కోశాధికారి నాయుడు, ఉపాధ్యక్షులు శంకరరావు, బాసస్వామి, రమణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సింహాచలం: అడవివరం గ్రామీణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు ప్రసాద్ పట్నాయక్, భాస్కర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికీ కేన్సర్‌పై అవగాహన అవసరమన్నారు. ఈ ర్యాలీలో ఆసుపత్రి వైద్యులు, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కళ్లకూ కేన్సర్ అవకాశం

ఆరిలోవ : కళ్లకు కూడా కేన్సర్ రావచ్చని ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆక్యులర్ అంకాలజిస్ట్ డాక్టర్ నేహా ఘోష్, డాక్టర్ అఖిలా మల్లు తెలిపారు. ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రిలో శనివారం కంటి కేన్సర్ పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల్లో కంటి కేన్సర్ గురించి అవగాహన చాలా తక్కువగా ఉంటుందన్నారు. ఈ వ్యాధిని త్వరితంగా నిర్ధారించి చికిత్స చేయకపోతే ఒక కంటి నుంచి మరో కంటికి లేదా ఇతర శరీర భాగాలకు వ్యాపించగలదని చెప్పారు. కంటి రెప్పలు, కంటి ఉపరితలంపై వాపు, గడ్డ ఉన్నట్లు గమనిస్తే ఆలస్యం చేయకుండా పరీక్షించుకోవాలని సూచించారు.

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు అన్నారు. ఉత్తర నియోజకవర్గం పరిధి 14, 24, 25 వార్డులకు సంబంధించిన జెబిఎస్ గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు షాదీఖానా మండపంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, ఉత్తర నియోజకవర్గ పరిశీలకులు చిక్కాల రామారావు, రాష్ట్ర జెసిఎస్ కన్వీనర్ హర్షవర్ధన్‌రెడ్డి, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'జగన్ హయాంలో కాపుల అభ్యున్నతి'

ప్రజాశక్తి-పెందుర్తి: వైసిపి ప్రభుత్వ హయాంలోనే కాపుల అభ్యున్నతి జరిగిందని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. జివిఎంసి 95వ వార్డు పరిధి వేపగుంట సమీపంలోని వరలక్ష్మీనగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో 31 మంది కాపులకు సీట్లు ఇచ్చారని, వారిలో 27 మంది గెలుపొందినట్లు చెప్పారు. కేబినెట్లో ఐదుగురు కాపులకు స్థానం కల్పించారని తెలిపారు. రాష్ట్రంలో 175 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టలేని పవన్ కల్యాణ్ కాపులను చంద్రబాబుకు తాకట్టు పెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు కాపు కల్యాణమండపం నిర్మాణానికి చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. ఎమ్మెల్యే అదీప్‌రాజు మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ముఖ్య పదవులను కాపులకు అప్పగించినట్లు తెలిపారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వ హయాంలో అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు పాల్గొన్నారు.

సిడిసి డీన్‌గా ఆచార్య సత్యనారాయణ రెడ్డి

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయం కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్‌గా ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యులు సిఎన్‌వి సత్యనారాయణరెడ్డి నియమితులయ్యారు. ఆచార్య ఎన్.సత్యనారాయణ పదవీ కాలం ముగియడంతో నూతన డీన్‌గా ఆచార్య సత్యనారాయణరెడ్డిని నియమించారు. ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి నుంచి ఆచార్య సత్యనారాయణరెడ్డి నియామక ఉత్తర్వులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ డీన్ ఆచార్య ఎన్.సత్యనారాయణ పాల్గొన్నారు.

కంప్యూటర్ సైన్స్ బిఒఎస్ చైర్‌పర్సన్‌గా లలిత భాస్కరి

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్‌గా విభాగ ఆచార్యులు డి.లలిత భాస్కరి నియమితులయ్యారు. ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి నుంచి నియామక ఉత్తర్వులను లలిత భాస్కరి స్వీకరించారు. అనంతరం ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత సమక్షంలో విభాగంలో బిఒఎస్ చైర్‌పర్సన్‌గా లలిత భాస్కరి బాధ్యతలను స్వీకరించారు.

వేడుకగా ది గ్లోబ్ స్కూల్ ఉత్సవ్

ప్రజాశక్తి -మధురవాడ : అయోధ్యనగర్‌లోని ది గ్లోబ్ స్కూల్ ఆవరణలో ది గ్లోబ్ ఉత్సవ్ 2.0ను చైర్మన్ బివి.రావు, కరస్పాండెంట్ అనురాధ ఆధ్వర్యాన శనివారం నిర్వహించారు. ఈ ఉత్సవంలో పిల్లలు తమ చేతితో చేసిన వస్తువులు గాజులు, హ్యాండ్ బ్యాగ్స్, ఇయర్ రింగ్స్, అలంకరణ వస్తువులు, కలరింగ్ చేసిన పాట్స్, బాటిల్ ఆర్ట్స్, పెయింట్స్ తదితరాలను ప్రదర్శించారు. వీటితో పాటు వివిధ రకాల ఆహార పదార్థాలు, పళ్ల రసాలు, పానీయాలు ప్రదర్శనలో ఉంచారు. పిల్లల్లో సృజనాత్మక పెంచడానికి, మార్కెట్ విధానంలోని లోటు పాట్లు తెలియజేయడానికి ఇవి దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. పలు ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం కేన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గంట వసంతకుమార్, ప్రిన్సిపల్ లలిత, ఏవో రామకృష్ణ, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణపై అవగాహన

ప్రజాశక్తి- మధురవాడ : వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రమాదాలు నివారించుకోవాలని పిఎం.పాలెం ట్రాఫిక్ సిఐ సాయి సూచించారు. కారు షెడ్ కూడలి వద్ద శనివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ లేని ద్విచక్ర వాహనదారులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించి గమ్యస్థానాలకు ఆనందంగా చేరుకోవాలని సూచించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేసిన వారు ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారని వివరించారు.

చైతన్య మహిళా డిగ్రీ కళాశాలకు ఐఎస్ఒ గుర్తింపు

ఎయు వీసీ ద్వారా ఐఎస్ఒ సర్టిఫికెట్ అందుకుంటున్న విజయలక్ష్మి, ప్రిన్సిపల్ చంద్రమహాలక్ష్మి తదితరులు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక చైతన్య మహిళా డిగ్రీ కళాశాలకు ఐఎస్ఒ గుర్తింపు లభించినట్లు కళాశాల కరస్పాండెంట్ విజయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు సర్టిఫికెట్‌ను ఆంధ్ర యూనివర్సిటీ వీసీ ప్రసాద్‌రెడ్డి ద్వారా శనివారం తీసుకున్నట్లు వివరించారు. 26 సంవత్సరాలుగా తమ కళాశాల అత్యుత్తమైన బోధన, ల్యాబ్, విలువలతో కూడిన విద్య, తాగునీటి సదుపాయం, ఆధునిక టెక్నాలజీపై తర్ఫీదు, చెట్లు పెంపకం తదితరాలను హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు మెచ్చి ఐఎస్ఒ 14001.2015 సర్టిఫికెట్‌ను తమ కళాశాలకు అందజేసినట్లు తెలిపారు.

యోగాపై శాస్త్రీయ పరిశోధనలు : ప్రొఫెసర్ మంజునాథ్ శర్మ

ప్రజాశక్తి -భీమునిపట్నం : యోగాపై శాస్త్రీయ పరిశోధనలు ఆవశ్యమని బెంగళూర్ స్వయాసాకు చెందిన వైస్‌ఛాన్సలర్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌కె మంజునాథ్ శర్మ అన్నారు. స్థానిక కృష్ణా కాలనీ యోగా చైతన్య సంస్థ ప్రాంగణంలో యోగాచార్య డాక్టర్ రావర్తి రామారావు పేరిట రెండు రోజులు నిర్వహించే శత జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డాక్టర్ మంజునాథ్ శర్మ మాట్లాడుతూ, యోగా పై చేసే శాస్త్రీయ పరిశోధనలు ప్రజలకు చేరువ కావాలన్నారు. యోగా ద్వారా అనేక వ్యాధులను నయం చేయవచ్చని స్పష్టం చేశారు. బిపి, సుగర్, కేన్సర్, స్త్రీలకు సాధారణంగా వచ్చే వివిధ రకాల వ్యాధులపై చేసిన పరిశోధనలను వివరించారు.

న్యూఢిల్లీకి చెందిన మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా, మినిస్ట్రీ ఆఫ్ ఆయుష్ డైరెక్టర్ డాక్టర్ ఈశ్వర వి బసవారెడ్డి, ముంబై ఇండియన్ యోగా ఇనిస్టిట్యూట్ అకడమిక్స్ అండ్ అక్రిడేషన్ కమిటీ డైరెక్టర్ డాక్టర్ గణేష్ రావు, గీతం యూనివర్సిటీ హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ సైకాలజీ డాక్టర్ కె.సునీత తదితరులు పలు అంశాలపై మాట్లాడారు. విజినిగిరి యోగా కన్సియస్‌నెస్ ట్రస్ట్ అధ్యక్షులు టిఎల్ నరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యోగా చైతన్య సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ కాలనీలో 'గడప గడపకూ..'

ప్రజాశక్తి -మధురవాడ : అర్హులందరికీ సంక్షేమ పథకాల అందించడమే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ధ్యేయమని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. 7వ వార్డు పరిధి కొమ్మాది వైఎస్ఆర్ కాలనీలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. అందుతున్న తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎవరికి ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వైఎస్ఆర్ కాలనీలో భూగర్భ డ్రెయినేజీ సమస్యను స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, వార్డు వైసిపి అధ్యక్షులు పోతిన హనుమంతురావు, పోతిన శ్రీనివాసరావు, మానస రమణ, అప్పారావు, చింతాడ శ్రీనివాసరావు, బండారి లక్ష్మి, రజిని, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

గీతంలో ఉత్సాహంగా 'షోర్ ఫెస్ట్ -23'

ప్రజాశక్తి -మధురవాడ

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆవరణలో రెండోరోజు శనివారం షోర్ ఫెస్ట్ -23లో ఉత్సాహంగా సాగింది. హీరోయిన్ రెజీనా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి సుమారు 5 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ సంప్రదాయ దుస్తుల్లో పెద్దఎత్తున హాజరైన విద్యార్థులు కేరింతల మధ్య గీతం ప్రాంగణం పండగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ప్రో- వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, స్టూడెంట్ లైఫ్ డిప్యూటీ డైరెక్టర్ రాహుల్ సింగ్, స్పోర్ట్స్ డైరెక్టర్ అరుణ్‌కార్తీక్ పాల్గొన్నారు.

క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-సీతమ్మధార : పౌర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. వర్తమాన అంశాలు, ఆర్థిక, భూగోళ, వైజ్ఞానిక, చరిత్ర, సంస్కృతి తదితర అంశాలపై 8 రౌండ్లలో గ్రంథాలయ కార్యదర్శి డివి సూర్యారావు ఆధ్వర్యాన క్విజ్ నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి -తగరపువలస : ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని ట్రాఫిక్ జోన్-1 పోలీస్ కమిషనర్ కె కుమారస్వామి స్పష్టం చేశారు. రోడ్డు భద్రతపై స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపినా, వాహనాల నంబర్లు కనబడకుండా ఉన్నా, రాంగ్ రూట్‌లో ప్రయాణించినా, ట్రిపుల్ రైడింగ్ చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు పాటించి, సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎ చంద్రశేఖర్, పిఎం.పాలెం సిఐ సాయి, స్థానిక ఎస్ఐ చిరంజీవి, కళాశాల ఎఒ సంతోష్, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయు ఆచార్యుల పరిశోధనా పత్రానికి అవార్డు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం కెమికల్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యుల పరిశోధనా పత్రానికి బెస్ట్ రీసెర్చ్ పేపర్ అవార్డు, నగదు పురస్కారం లభించాయి. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీర్స్ ప్రచురించే ప్రతిష్ఠాత్మక జర్నల్‌లో విభాగ ఆచార్యులు జివిఎజె రాజు, జివిఎస్ శర్మ, కెవి.రమేష్, సి.భాస్కరశర్మల పరిశోధన పత్రం ప్రచురితమైంది. ఈ పరిశోధన పత్రానికి మూడు విభాగాలలో కెమికల్ వీక్లీ అవార్డు, ఐఐసిహెచ్ఇ ఎన్ఆర్ఐ అవార్డు, కూలూర్ మెమోరియల్ అవార్డులు లభించాయి. ఈ మేరకు దీనికి సంబంధించిన ధ్రువపత్రాలను ఏయూ ఆచార్యులకు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీర్స్ అందించింది.

శారదా నదిపై బ్రిడ్జి, రోడ్డు విషయమై సిఎంకు లేఖ

సిపిఎం మాజీ ఎంపీ మధు

ప్రజాశక్తి- దేవరాపల్లి

దేవరాపల్లి వద్ద శారదా నదిపై బ్రిడ్జి, రోడ్డు విషయంపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి లేఖ రాస్తానని సిపిఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి, రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు తెలిపారు. అనంతగిరి మండలంలో పర్యటనకు వచ్చిన ఆయన శనివారం దేవరాపల్లి నుండి పెదకోట వరకు గల రోడ్డును పరిశీలించారు. ఏజెన్సీ ముఖద్వారమైన దేవరాపల్లి శారదా నదిపై బ్రిడ్జిని చూసి ఆశ్చర్య పోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారదా నదిపై ఎప్రోచ్ రోడ్డు పనులు పూర్తి చేసి పినకోట రోడ్డు మరమ్మతులు చేయాలని కోరారు. జీనబాడు, పినకోట, పెదకోట, కివర్ల పంచాయతీలో దాదాపుగా 160 గిరిజన గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడం, బ్రిడ్జి పనులు అసంతృప్తిగా వదిలి పెట్టడం దుర్మార్గమన్నారు. గిరిజనులు ప్రాణాలు అంటే ప్రభుత్వానికి లెక్కలేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత అధ్వానంగా ఉన్న రోడ్డు మరెక్కడా లేదన్నారు. ఇక్కడ పాలకులు నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని తెలిపారు. సరైన రోడ్డు లేకపోవడంతో పినకోట, జీనబాడులో ఆశ్రమ పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి పోయే ఉద్యోగులు, ప్రజలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల వ్యవసాయ, అటవీ ఉత్పత్తులను దోపిడీ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. జీసీసీని ప్రభుత్వం నిర్వీర్యం చేసిన తరువాత దళారులు మరింతగా రెచ్చిపోతున్నారని, వెంటనే ప్రభుత్వ గిరిజన ఉత్పత్తులకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, దేవరాపల్లి మండల కార్యదర్శి బిటి దొర, సిహెచ్.లక్ష్మణ ఉన్నారు.

నిర్మాణం నిలిచిన బ్రిడ్జిని పరిశీలిస్తున్న మధు

మోడల్ పరీక్ష రాస్తున్న పదో తరగతి విద్యార్థులు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన టెన్త్ మోడల్ పరీక్ష

ప్రజాశక్తి-అచ్యుతాపురం

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో శనివారం 10వ తరగతి చదువుతున్న 300 మంది విద్యార్థులకు అచ్యుతాపురంలో మోడల్ టెస్ట్ నిర్వహించారు. పరీక్షా పత్రాలను హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె.విజయ, హై స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ ధూళి వెంకునాయుడు చేతులు మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్ రమణ మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించడమే ముఖ్యమైన ఉద్దేశమన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఆబ్జెక్టివ్ టైపు ప్రశ్నాపత్రాలు తయారు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎంఎం రమణ, అనకాపల్లి నాయకులు గొర్లి తరుణ్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కే సోమునాయుడు, బాబ్జి, బాలాజీ, సంతోష్ పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డిప్యూటీ సిఎం

కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- దేవరాపల్లి : ఐదు రోజులు పాటు జరుగుతున్న మండల కేంద్రంలో ఉమామహేశ్వరి దేవి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శనివారం సాయంత్రం బాలికల కబడ్డీ పోటీలను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రారంభించారు. ఈ కబాడీ పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల నుంచి వచ్చిన జన సందోహంతో ఆ ప్రాంగణమంతా సందడిగా మారింది. చివరి రోజు ఆదివారం దేవి అమ్మవారి విగ్రహాలను ఊరేగింపు కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వరదపురెడ్డి సింహాచలంనాయుడు, కెవి రమణ, వాలేటి నాగరాజు, చల్లా నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎసిబికి చిక్కిన విఆర్ఒ

- రూ.10 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వెంకటచలపతిరావు

- గతంలోనూ పలు ఆరోపణలు

ప్రజాశక్తి - పరవాడ

పట్టుబడ్డ విఆర్ఒ చలపతిరావు, నగదు

పరవాడ తహశీల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ విశాఖపట్నం రేంజ్ అధికారులు శనివారం మధ్యాహ్నం 12.10 గంటల సమయంలో దాడి నిర్వహించి, రావాడ విఆర్ఒ గేదెల వెంకట చలపతిరావు రూ.10 వేలు లంచం తీసుకుంటుండడంగా రెడ్ హ్యాండ్‌గా పట్టుకున్నారు. రావాడ రెవెన్యూలోని భూమిని యలమంచిలి గ్రామానికి చెందిన వ్యక్తి కొనుగోలు చేశారు. ఈ భూమిని తన పేరును ఆన్‌లైన్ అడంగల్‌లో నమోదు చేయాలని దరఖాస్తు చేయగా విఆర్ఒ వెంకట చలపతిరావు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించడంతో వారి శనివారం ఉదయం నుండి తహశీల్దార్ కార్యాలయం చుట్టూ, విఆర్ఒ తహశీల్దార్ కార్యాలయం పక్కనే అద్దెకు ఉంటున్న ఇంటి వద్ద మాటువేశారు. విఆర్ఒ చలపతిరావు తహశీల్దార్ కార్యాలయం నుండి తన రూముకు బాధితున్ని తీసుకొని వెళ్ళి రూ.10 వేలు లంచం తీసుకుంటూ ఉండగా ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీంతో రెవెన్యూ అధికారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. రావాడ విఆర్ఒ చలపతిరావు గత ఐదేళ్లగా నుండి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఏసీబీ అధికారుల దాడులు నిర్వహించడం చర్చనీయాంసంగా మారింది. చలపతిరావు గతంలో అనకాపల్లిలో రెండు దఫాలు, భీమిలి మండలంలో ఒకసారి వీఆర్వోగా పనిచేశారు. బదిలీపై ఇటీవల పరవాడ మండలం రావాడ పంచాయతీకి విఆర్ఓగా వచ్చారు. అనకాపల్లిలో విధులు నిర్వహిస్తున్న సమయంలో కూడా ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించగా అప్పట్లో తప్పించుకున్నారు. నాటి దాడుల్లో చలపతిరావు అద్దెకి తీసుకున్న గదిలో మద్యం సేవిస్తూ అధికారులకు పట్టుబడడంతో కేసు నమోదు చేశారు. ఇప్పుడు మరలా పరవాడ రెవెన్యూ కార్యాలయంలో చలపతిరావుపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించడం స్థానికంగా సంచలనం కలిగిస్తుంది. ఆయన ఇంటిలోనూ, తహశీల్దార్ కార్యాలయంలోనూ ఎసిబి ఏఎస్పి కె శ్రావణి, డిఎస్పీ రమణ మూర్తి, ఇన్‌స్పెక్టర్లు కిశోర్ కుమార్, ప్రేమ్ కుమార్, సతీష్ కుమార్‌తో కూడిన బృందం సోదాలు నిర్వహించారు.

రాజధాని పేరుతో ఎన్నాళ్లు మోసగిస్తారు

ప్రజాశక్తి-అనకాపల్లి : రాజధాని పేరుతో మంత్రి అమర్నాథ్ ప్రజల్ని ఎన్నాళ్లు మోసగిస్తారని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు ప్రశ్నించారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ పరిపాలన రాజధాని అయితేనే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని గత మూడేళ్లగా ప్రజలను మోసగిస్తూ కాలం వెళ్లదీశారన్నారు. అభివృద్ధి చేయడానికి రాజధాని అవసరం లేదని, చిత్తశుద్ధి ఉంటే చేయవచ్చని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రలో విశ్వవిద్యాలయాలకు నిధులు, రైల్వే జోన్, వెనుకబడ్డ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు తేవడంలో రాష్ట్ర ప్రభుత్వం, ఎంపీలు, విశాఖ జిల్లాకు చెందిన మంత్రులకు బాధ్యత లేనట్టు వ్యవహరించడం సరికాదన్నారు. బలహీన ముఖ్యమంత్రి వల్లే ఉత్తరాంధ్రకు అన్యాయం జరిగిందని విమర్శించారు. విశాఖలో ప్రభుత్వ భవనాలు భూములను తాకట్టు పెట్టారని, భూములు కబ్జా చేయడం, అవినీతి అక్రమాలకు పాల్పడడం ఈ ప్రభుత్వంలో అలవాటుగా మారిందని తెలిపారు. ప్రజలపై పన్నుల భారం విపరీతంగా పెంచారని, నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయని తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు కుప్పిలి జగన్మోహన్, బోడి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో సూపర్ స్పెషాలిటీ కేన్సర్ ఆసుపత్రి నిర్మించాలని వినతి

ప్రజాశక్తి- అనకాపల్లి

గ్రామీణ ప్రాంతాల్లోని కేన్సర్ రోగులకు మెరుగైన చికిత్స అందించేందుకు జిల్లా కేంద్రం అనకాపల్లిలో కేన్సర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా కేన్సర్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, చికిత్స శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బొట్టా చిన్ని యాదవ్, బొడ్డేడ అప్పారావు, ఆడారి బుచ్చి రాము, వాసుపల్లి తాతయ్యలు, పొట్ల అప్పారావు, బొబ్బిలి గోవిందరాజు, ముగడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

7న జిల్లాస్థాయి ఎడ్ల బళ్ల పరుగు పోటీలు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఆరిపాక పంచాయితీ శివారు చిన యాతపాలెంలో వీరాంజనేయ స్వామి తీర్థ మహోత్సవం సందర్భంగా ఈ నెల7న జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పందెం పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు ఆలయ ప్రాంగణంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తామన్నారు. కోలాటాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు, వీటిని జయప్రదం చేయాలని కోరారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ బోగస్ ఓట్లను తొలగించాలని వినతి

ప్రజాశక్తి -కె.కోటపాడు

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదులో పలు అవకతవకలు చోటుచేసుకున్నాయని, బోగస్ ఓట్లను తొలగించాలని ప్రజాసంఘాల నాయకులు శనివారం స్థానిక తహశీల్దార్ రమేష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయిన బాబు విలేకరులతో మాట్లాడుతూ కె.కోటపాడు మండలంలో సచివాలయ వాలంటీర్ల ద్వారా అనేకమంది అర్హత లేని వారి పేర్లను నమోదు చేయించారని, విద్యార్హత లేని ఎమ్మెల్సీ ఓటర్లను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఎర్ర దేవుడు, గాడి ప్రసాద్, వనుము సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దారు వినతిపత్రం ఇస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఘనంగా ఎంవిఆర్ జన్మదిన వేడుకలు

కేక్ కట్ చేస్తున్న ఎంవిఆర్ దంపతులు

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రముఖ వ్యాపారవేత్త, ముత్యాల గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన పలు నియోజకవర్గాల నుంచి ఎంవిఆర్ అభిమానులు, నాయకులు వాహనాల్లో స్థానిక విజయరామరాజుపేటలో ఉన్న ఎంవిఆర్ గృహానికి వచ్చి పూల బొకేలు, సాలువాలు, జ్ఞాపకలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ముందుగా ఎంవిఆర్ కుమారులు రాజేష్, సతీష్‌తో కలిసి ప్రత్యేక వాహనంలో వేలాదిమంది అభిమానుల మధ్య, మేళ తాళాలు, తప్పెటగుళ్ళు, తోడ పెద్దులు, అశ్వాల ఊరేగింపుతో దేవుని గుమ్మం వెంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెస్సార్ షాపింగ్ యజమాని ముత్యాల సుబ్బారావు తమ సిబ్బందితో ఎంవిఆర్‌కు ఘన స్వాగతం పలికి పూలమాల సాలువ మెమెంటోలతో సత్కరించారు. నెహ్రూ చౌక్ జంక్షన్‌లో క్రేన్ సహాయంతో భారీ గజమాలను అభిమానులు ఎంవిఆర్‌కు వేసి సత్కరించారు. అనంతరం ఎంవిఆర్ స్వగృహం వద్ద అభిమానులు, నాయకులు ఏర్పాటు చేసిన 49 కిలోల భారీ కేకును తన సతీమణి సూర్య కుమారి, కుమారులు రాజేష్, సతీష్, ప్రముఖ బాలీవుడ్ నటి జూనియర్ రష్మిక, అభిమానులు నాయకులు మధ్య కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంవిఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనలో సుమారు 5,000 మంది పాల్గొన్నారు.

ఊరేగింపులో ఎంవిఆర్‌కు గజమాల వేస్తున్న దృశ్యం

ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు

97వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి- రాంబిల్లి : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వాడనర్సాపురం వద్ద నేవీ గేట్ ముందు 8 గ్రామాల నిర్వాసితులు చేపట్టిన ఆందోళన శనివారం నాటికి 97వ రోజుకు చేరింది. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. శారద, వరహ నదిలో వేటకు వెళ్లి తమ జీవనాన్ని కొనసాగించే వాళ్ళమని, ఎన్ఎఒబి వచ్చిన తరువాత తమ ఉపాధి కోల్పోయామని, ఇప్పుడు తమపై దౌర్జన్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు, జిల్లా అధికారులకు, మండలాధికారులకు ఇది న్యాయమా? అని ప్రశ్నించారు. తక్షణమే సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

చెరువులను పరిశీలించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం, ఉగ్గినపాలెం, కన్నూరుపాలెం గ్రామాల్లో చెరువులను ఎంపిడిఒ కొంకి అప్పారావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుల్లో తడి, పొడి చెత్త వేయకుండా, చెరువు గర్భం, గట్లుపై పిచ్చి మొక్కలు తొలగింపు చర్యలు చేపట్టాలని కలెక్టర్ రవి సుభాష్ ఆదేశాల మేరకు పరిశీలించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ పరిమిళాదేవి, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, తాళ్ళపాలెం ఎంపిటిసిలు లగిశెట్టి భవానీ, ఇందల హేమలత పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తలను వేధిస్తే సహించేది లేదు

ప్రజాశక్తి -కశింకోట : టిడిపి కార్యకర్తలను వేధిస్తే సహించేది లేదని మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ హెచ్చరించారు. మండలంలోని ఎన్‌జి.పాలెం గ్రామంలో శనివారం కాఫీ విత్ క్యాడర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో టీడీపి శ్రేణుల యోగక్షేమాలు తెలుసుకోవడానికే కాఫీ విత్ క్యాడర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, దానికి ప్రతి ఒక్క కార్యకర్త సన్నద్ధం అవ్వాలని కోరారు. టిడిపి మండల అధ్యక్షుడు కాయల మురళి, ఎంపిటిసి షేక్ దర్గా, మాజీ సర్పంచ్ ఎలమంచిలి వెంకటరావు, మాజీ ఎంపీటీసీలు కలిగెట్ల సరస్వతి, మజ్జి నిరంజన్ కుమార్, పార్టీ నాయకులు కలిగెట్ల మహాలక్ష్మీ నాయుడు, కలిగెట్ల సంజీవ్, బోండా వెంకట రమణ, ఎలమంచిలి పద్మా, కొఠారి గణేష్, కలిగెట్ల సోమేష్, బండి కృష్ణ, అప్పికొండ గోవిందా, చొప్పా వాసు, గోపి పాల్గొన్నారు.

7న ఉచిత వాహనాల మంజూరుకు ఎంపిక

ప్రజాశక్తి- అనకాపల్లి : విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల మోటారు వాహనాలను మంజూరు చేయడానికి ఈనెల 7న ఎంపిక చేయడం జరుగుతుందని విభిన్న ప్రతిభావంతుల, వృద్ధుల సహాయ సంస్థ మేనేజర్ జివిబి జగదీష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జిల్లా ఎంపిక కమిటీ ద్వారా జరిగే ఈ ఎంపికల్లో ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న వారు హాజరు కావాలని సూచించారు. సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, పదవ తరగతి సర్టిఫికెట్, ఎస్సీ, ఎస్టీలు తమ కుల ధ్రువీకరణ పత్రం, అంగవైకల్యం ఫోటో, ఈ ఏడాది జారీ చేసిన ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఎంపీడీవో లేదా మున్సిపల్ కమిషనర్ జారీ చేసిన స్వయం ఉపాధి ధ్రువ పత్రం, తమపై ఎటువంటి కేసులు అభియోగం లేనట్టు ధ్రువీకరణ పత్రం, తమకు ఎటువంటి మోటార్ వాహనం లేదని, గతంలో ప్రభుత్వం నుంచి మంజూరు కాలేదని ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని సూచించారు.

ధ్యానంతో ఆరోగ్యం

ప్రజాశక్తి -అనకాపల్లి : ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జ్ఞాన ఉపన్యాసకులు నరేంద్ర మొదలియార్ అన్నారు. జీవీఎంసీ విలీన గ్రామం సిరసపల్లి శ్రీదత్త క్షేత్రంలో త్రిశక్తి మహిళా ధ్యాన మహా చక్ర పిరమిడ్స్ మాస్టర్స్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఆధ్యాత్మిక జ్ఞాన సందేశాలు, సంగీత ధ్యానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రెండో రోజు శనివారం ఆయన మాట్లాడుతూ ధ్యానం వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, ఆత్మవిశ్వాసం, మానసిక ప్రశాంతత కలుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సత్యదేవ్, కెఎస్ఎన్ రాజు, విజయ భాస్కర్ రెడ్డి, సుమారు 3000 మంది భక్తులు పాల్గొన్నారు.

ఉచిత బీమా కల్పించాలి

ఎపి గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం డిమాండ్



నిరసన తెలుపుతున్న గొర్రెలు, మేకల పెంపకందారులు

ప్రజాశక్తి- రాంబిల్లి

గొర్రెలు మేకలు పెంపకందారులకు ఉచిత ఇన్సూరెన్స్ కల్పించాలని, ఇన్సూరెన్స్‌తో సంబంధం లేకుండా పశువైద్యం అందించాలని ఎపి గొర్రెలు మేకలు పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంటా శ్రీరామ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోకాడ దేముడు నాయుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంఘం ఆధ్వర్యాన మండలంలోని రజాల గ్రామంలో గొర్రెలు మేకలు పెంపకందారులు శనివారం ర్యాలీ నిర్వహించి, కమ్యూనిటీ భవనం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇన్సూరెన్స్ కల్పించే జీవ క్రాంతి పథకం ఏకపక్షంగా ఎత్తివేయడం దారుణమన్నారు. ఇప్పటి వరకు మూడు నుంచి 20 జీవాలు వరకు ప్రభుత్వం ఉచితంగా ఇన్సూరెన్స్ లేకుండా నష్టపరిహారం చెల్లిస్తుందని, ఇప్పుడు ఈ పథకాన్ని ఎత్తిసి డబ్బులు చెల్లించమనడం దుర్మార్గమన్నారు. ఇన్సూరెన్స్ చేయించుకున్న వారికి మాత్రమే పశు వైద్యం అందిస్తామని చెప్పడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఇప్పటికైనా ఎటువంటి షరతులు లేకుండా ఉచితంగా జీవాలకు వైద్యం అందించాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తూ హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం కనీసం జీవాలకు డివార్మింగ్ కూడా అందించలేని దుస్థితిలో ఉందన్నారు. సచివాలయానికి నెలకు రూ.5వేలు విలువగల మందులు పంపిణీ చేస్తున్నామని కాగితల్లో చూపిస్తున్నారని వాస్తవంగా ఖర్చు చేయలేదని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్‌సిడిసి నిధులను విడుదల చేసి పెంపకందారుల సహకార సంఘాలకు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు ఉరిగిటి అప్పారావు, పెంపకందారులు పాల్గొన్నారు.

నగదు చోరీ కేసును ఛేదించిన పోలీసులు

వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి సునీల్

ప్రజాశక్తి -బుచ్చయ్య పేట

మండలంలోని పలు గ్రామాలలో గల ఆలయాలు, ఆంజనేయ స్వామి గుడిల్లో హుండీల అపహరణ కేసును బుచ్చయ్యపేట పోలీసులు 24 గంటలు గడవక ముందే ఛేదించి నిందితులను అదుపులో తీసుకున్నారు. ఈ మేరకు అనకాపల్లి డిఎస్‌పి బి.సునీల్ బుచ్చయ్యపేట పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు వివరాలను వెల్లడించారు. గురువారం రాత్రి మండలంలోని దిబ్బిడి, బుచ్చయ్యపేట, కెపి.అగ్రహారం, కొండపాల తదితర గ్రామాల్లోని ఆలయాల్లో చోరీకి సంబంధించి రోలుగుంట మండలం, జె.నాయుడుపాలెం గ్రామానికి చెందిన పడాల సతీష్ కుమార్, మరిశా శ్యామ్ కుమార్, బలిరెడ్డి జనార్ధన్‌తో పాటు మరో మైనర్ బాలుడిని అరెస్టు చేసినట్లు చెప్పారు. వీరి నుండి రూ.24 వేలు నగదును స్వాధీనం చేసుకొని, నలుగురిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించారు. మండలం చిన్నపాచిల ఆలయంలో హుండీని కూడా తామే చోరీ చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు డిఎస్‌పి తెలిపారు. హుండీల చోరీ కేసును చాకచక్యంగా వ్యవహరించి నిందితులను అదుపులో తీసుకున్న ఎస్సై కుమారస్వామి, అదనపు ఎస్‌ఐ సింహాచలం నాయుడు, హెడ్ కానిస్టేబుల్ జె అర్జున, కానిస్టేబుల్ ఏ.శివను డిఎస్‌పి సునీల్ అభినందించారు. నిందితులను పట్టుకోవడంలో సహకరించిన కానిస్టేబుల్ ఎ.వెంకట్రావు, ఎం చిన్న వెంకటరావు, కె.పైడిరాజును ప్రశంసించారు.

పట్టించిన సీసీ కెమెరా

ఆలయాల్లో హుండీల చోరీ ఘటనకు సంబంధించి పోలీసులు ఆంజనేయ స్వామి గుడి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన సిసి కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. సీసీ కెమెరాలు దొంగతనానికి పాల్పడిన నలుగురు వ్యక్తులు ఆనవాళ్లు కనపడడంతో గుర్తించి నిందితులను అదుపులో తీసుకున్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ సౌజన్య

కేన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : కేన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ సౌజన్య తెలిపారు. స్థానిక ఎఎంఎఎల్ కళాశాలలో శనివారం క్లోజ్ ది కేర్ గ్యాప్ ప్రపంచ కేన్సర్ దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ సౌజన్య మాట్లాడుతూ కేన్సర్ రకాలు, వాటి దుష్ప్రభావాలు, కేన్సర్‌ను గుర్తించడం, నివారించడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ తమ ప్రాంతాల్లో కేన్సర్ వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం హరిబాబు, మణి, తాతారావు, మహిళ సాధికారత కన్వీనర్ సామ్రాజ్యం, సూపరింటెండెంట్ అనురాధ, విద్యార్థులు పాల్గొన్నారు.

తీర్థాలకు పింఛను సొమ్ము వసూలుపై ఫిర్యాదు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని మంగళాపురం శివారు కుమ్ముందానపేట గ్రామంలో తీర్థం నిమిత్తం ఒక్కొక్క పింఛన్‌దారుల నుండి వెయ్యి రూపాయలు చొప్పున అధికార పార్టీకి చెందిన నాయకులు వసూలు చేశారని ఆ గ్రామానికి చెందిన ఆది గిరిబాబు పంచాయతీ కార్యదర్శికి శనివారం ఫిర్యాదు చేశారు. ఈ అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- కశింకోట : రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలని అచ్చర్ల గ్రామ సర్పంచ్ నిమ్మదల సోమేశ్వరరావు అన్నారు. మండలంలోని అచ్చర్ల గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై శనివారం అవగాహన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు సేంద్రియ ఎరువులు, విత్తనాలతో పంటలు సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మదిని మహేష్, విహెచ్ఏ కిషోర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, సిఆర్‌పి ద్వారపురెడ్డి రమణ, నాగమణి, సత్యవతి పాల్గొన్నారు

ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆటో

- ఒకరు మృతి, ఐదుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలోని చంద్రయ్యపేట పెట్రోల్ బంక వద్ద ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, ఆటో డ్రైవర్‌తో సహా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కె.కోటపాడు పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని కింతాడ పంచాయితీ శివారు జోగన్నపాలెం గ్రామానికి చెందిన బండారు సన్యాసినాయుడు (40) శనివారం ఉదయం ఆయన భార్య రామలక్ష్మిని తీసుకొని విశాఖపట్నం బంధువులు ఇంటికి వెళ్లడానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. చంద్రయ్య పేట వద్ద ఉన్న పెట్రోల్ బంకులో పెట్రోల్ పోయించుకుని, రోడ్డు దాటుతుండగా, విశాఖపట్నం నుంచి కె.కోటపాడు వైపు వస్తున్న ఆటో బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో సన్యాసినాయుడు, ఆయన భార్య రామలక్ష్మికి, ఆటోలో ఉన్న ముగ్గురు ప్రయాణికులకు, ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని విశాఖపట్నంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. అయితే సన్యాసినాయుడు పరిస్థితి విషమించి ఆయన మృతి చెందాడు. మతుడు సన్యాసినాయుడు తండ్రి గంగు నాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకుగ కేసు నమోదు చేస్తున్నట్లు కె.కోటపాడు ఎస్సై ధనుంజయ్ తెలిపారు. మిగిలి వారికి బలమైన దెబ్బలు తగిలాయని చెప్పారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు అన్నారు. స్థానిక అచ్యుతా డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థుల వీడ్కోలు సమావేశం, వార్షికోత్సవం జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న కన్నబాబురాజు చేతుల మీదుగా గతేడాది అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులను, గురువులను, సమాజాన్ని గౌరవించాలన్నారు. ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, విద్య పట్ల దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మాజీ చైర్మన్ సుకుమార వర్మ, వైయస్సార్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు దేశం శెట్టి శంకర్రావు, పార్టీ సీనియర్ నాయకులు కోన బుజ్జి, అచ్యుత విద్యాసంస్థల వ్యవస్థాపకుడు పల్లి శేషగిరిరావు, కె విమల నాయుడు, బలిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ కాంతంకు నివాళి

ప్రజాశక్తి-కశింకోట : కశింకోటలో ఇటీవల మృతి చెందిన సీనియర్ పాత్రికేయులు ఆళ్ళ వెంకట అప్పారావు తల్లి లక్ష్మి కాంతంకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ శనివారం నివాళులర్పించారు. అప్పారావు కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అలాగే వైసిపి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్, విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, మాజీ జెడ్‌టిసి మలసాల ధనమ్మ, ఎంపిపి కలగా లక్ష్మి, వైసిపి అధికార ప్రతినిధి మళ్ళ బుల్లి బాబు, సర్పంచ్‌లు కలగా గున్నయ్యనాయుడు, మంత్రి జయరజని, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టిడిపి నాయకులు బుద్ధ నాగ జగదీష్, కాయల మురళి, వేగి గోపికృష్ణ, పెంటకోట రాము తదితరులు లక్ష్మీకాంతం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులిర్పంచారు. ఈ సందర్భంగా జామి మొక్కలు పంపిణీ చేశారు.

పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి గుడివాడ

రసాభాసగా సర్వసభ్య సమావేశాలు

ప్రశ్నిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి-నక్కపల్లి: అక్రమ గ్రావెల్ తవ్వకాలతో మండలంలోని అధికారులు ఉన్నట్టా లేనట్టా అని చినతీనార్ల ఎంపిటిసి సభ్యులు వాసుపల్లి అప్పలస్వామి ప్రశ్నించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఎంపిడివో సీతారామరాజు ఆధ్వర్యంలో ఎంపిపి ఏనుగుపల్లి రత్నం అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అప్పలస్వామి మాట్లాడుతూ, చినతీనార్లలో తిప్పలవాని చెరువులో అక్రమంగా మట్టి తరలించక పోతున్నారని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ ఏఈ లోకేష్ మాట్లాడుతూ చెరువును పరిశీలించి ఆధారాలతో రెవెన్యూ అధికారులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. చినదొడ్డిగల్లు బర్రి వీధిలో మురుగు నీటి సమస్యకు సంబంధించి అధికారుల ఆదేశాల మేరకు సర్వే చేపట్టడం జరిగిందని, సర్వే రిపోర్టు ఇంతవరకు ఎందుకు ఇవ్వలేదని మండల సర్వేయర్ మూర్తిని మండల పరిషత్ ఉపాధ్యక్షులు వెలగా ఈశ్వరరావు నిలదీసారు. సర్వే రిపోర్టును ఆన్ లైన్ లో పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సర్వేయర్ మూర్తి మాట్లాడుతూ, సర్వే రిపోర్టును తహసీల్దార్ కు అందజేశామని బదులిచ్చారు. పెద్ద తీనార్ల సర్పంచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, పుంతరోడ్డు ఆక్రమణకు గురి కావడంతో రోడ్డు నిర్మాణం చేపట్టడానికి అవకాశం లేకుండా పోయిందని, రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దొండవాకలో అసంపూర్తిగా ఉన్న అంగన్వాడి కేంద్ర నిర్మాణం పనులను పూర్తి చేయాలన్నారు. ఉద్దండపురం సర్పంచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ధాన్యం సేకరణకు సంబంధించి రైతుల ఇబ్బందులను వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఆర్‌బికేల ద్వారా ధాన్యం కొనుగోలును ఏప్రిల్, మే నెల వరకు పొడిగించాలని కోరారు. పెద తీనార్ల ఎంపిటిసి సభ్యులు నాగేశ్వరరావు మాట్లాడుతూ, రేషన్ బియ్యం వాహనం ద్వారా ఇంటింటికీ సరఫరా చేయాలన్నారు. పెదతీనార్ల తో పాటు దొండవాక కూడా ఒకేసారి జలజీవన్ మిషన్ పనులు చేపట్టాలని కోరారు. డొంకాడ సర్పంచ్ అల్లు పార్వతి మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలని కోరారు. డిఎల్ పురం ఎంపిటిసి సభ్యులు కొండ్ర కనకారావు మాట్లాడుతూ గ్రామంలో పలువురు బతికుండగానే మృతి చెందారని రేషన్ కార్డుల్లో తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ మాట్లాడుతూ, సభ్యులు లేవనెత్తిన సమస్య లను అధికారులు సకాలంలో పరిష్కరించాలన్నారు.

వాడి వేడిగా సమావేశం

కోటవురట్ల: మండల సమావేశం మందిరంలో శనివారం ఎంపిపి అప్పలనాయుడు అధ్యక్షతన జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశం వాడి వేడిగానే జరిగింది. సమావేశం ప్రారంభంలోనే తెలుగుదేశం పార్టీ ఎంపిటిసి సభ్యులు హాజరు రిజిస్టర్ పై సంతకం పెట్టక పోవడంతో వైస్ ఎంపిపి దత్తుడురాజు సంతకం చేయకపోతే బయటికి వెళ్లి పోవాలనడంతో ఒకసారిగా ఆ పార్టీ సభ్యులు పోడియం దగ్గరికి వెళ్లి సభాధ్యక్షులను నిలదీశారు. సంతకం సభ పూర్తి అయిన తర్వాత కూడా పెట్టవచ్చునని అనడంతో ఇరువర్గాల మధ్య కాసేపు గందరగోళం నెలకొంది. అనంతరం సభ ప్రారంభంలో ధాన్యం కొనుగోలు పై వ్యవసాయ అధికారి నిర్లక్ష్యం పట్ల అధికార ప్రతిపక్ష నాయకులు అసహనం వ్యక్తం చేశారు. మండలంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీలు పరిస్థితి చాలా అధ్వానంగా ఉందని రాజుపేట సర్పంచ్ వెంకటరమణ అసంతృప్తి వ్యక్తం చేశారు.

కొడవటిపూడి గ్రామ సర్పంచ్ అప్పారావు కాలనీ వద్ద నీటి సౌకర్యం లేకున్నా పట్టించుకోలేదని, కోదండరాం పురానికి రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా నిలిచి పోయిందని సభ్యులు అన్నారు. నీలిగుంట గ్రామ సర్పంచ్ వరహాల బాబు మాట్లాడుతూ, 104 వాహనం గ్రామంలోకి గతంలో వచ్చేదని, ప్రస్తుతం బోడపాలెం సచివాలయంలో ఉండడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపిపి సుజాత, ఎంపిడివో చంద్రశేఖర్, తహసిల్దార్ జానకమ్మ, ఎంపిటిసి సభ్యులు, గ్రామ సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

వేదిక వద్దకు దూసుకొచ్చిన సభ్యులు

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేత బాబ్జీ

ప్రభుత్వ విద్యకు ప్రాధాన్యత ఏదీ ?

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబ్జీ

ప్రజాశక్తి -నక్కపల్లి: కేంద్రం ప్రవేశపెట్టిన విద్యా బడ్జెట్ 2023-24 కార్పొరేట్ విద్యాసంస్థల ప్రయోజనాలకు దోహదపడుతుందని ప్రభుత్వ విద్యా వ్యవస్థను నాశనం చేయాలనే ఉద్దేశ్యంతో రూపొందించినట్లుగా ఉందని అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షులు బి.బాబ్జీ విమర్శించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం లో ఆయన మాట్లాడారు. నిధుల కేటాయింపులను తగ్గించారని విమర్శించారు. గత బడ్జెట్లో కేటాయించిన నిధులు ఎంత ఖర్చు చేశారన్న దానిపై కూడా ప్రభుత్వం వద్ద సమాధానం లేదన్నారు. స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేయాలని బడ్జెట్లో పెట్టిన నిబంధన విద్య ప్రైవేటీకరణ, వ్యాపారీకరణకు గేటును తెరుస్తుందని ఆరోపించారు. విద్యా రంగాన్ని పూర్తిగా ప్రైవేటీకరించే ప్రణాళికను ఈ బడ్జెట్ ప్రతిబింబిస్తుందన్నారు. బడ్జెట్ ను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. ప్రభుత్వ విద్యను నాశనం చేయాలనే ఉద్దేశంతో ఉన్న కేంద్రానికి వ్యతిరేకంగా బలమైన ఉద్యమాన్ని చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సింహాద్రి, శ్రీను పాల్గొన్నారు.

వేడుకుంటున్న చిన్నారులు

పాఠశాలను ఏర్పాటు చేయరూ..

ప్రజాశక్తి-రోలుగుంట: జిల్లా కలెక్టర్ గారు మాకు స్కూల్ ఏర్పాటు చేయాలని, అమ్మఒడి పథకం వర్తింపు చేయాలని, రేషన్ కార్డులో మా పేర్లు చేర్పించాలని, మాకు బర్త్ సర్టిఫికెట్లు ఇప్పించాలంటూ రోలుగుంట మండలం ఆర్ల పంచాయతీ పిత్రిగెడ్డ ఆదివాసి గిరిజన చిన్నారులు, పెద్దలు చేతులు జోడించి వేడుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పిత్రిగెడ్డ ఆదివాసి గిరిజన గ్రామానికి చెందిన తొమ్మిది కుటుంబాలకు చెందిన 18 మంది చిన్న పిల్లలు ఉన్నారని, కొండు తెగ ఆదివాసి గిరిజనులైన వీరు కొండ గ్రామాల్లో జీవనం సాగిస్తున్నామన్నారు. తమ పిల్లలు చదువుకోవాలంటే ఏడు కిలోమీటర్ల దూరం దట్టమైన అడవి నుంచి వెళ్లి చదువుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రత్యామ్నాయ పాఠశాల, అంగన్వాడి సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. పిల్లల పేర్లు రేషన్ కార్డులో చేర్పించాలన్నారు. ఇప్పటికైనా అనకాపల్లి జిల్లా కలెక్టర్ గ్రామంలో పర్యటించాలని గ్రామస్తులు కొర్ర సుబ్బారావు, కొర్ర కృష్ణ, కొర్ర కొండబాబు కోరారు.

సైకో హల్ చల్

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని దోసలపాడు పంచాయతీ చీడిక కొత్తూరులో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన యువకుడు హల్ చల్ చేయడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. బోల్ భుగల్ గ్రామానికి చెందిన యువకుడు సోకెల అస్త శనివారం చీడిక కొత్తూరు గ్రామస్తులపై కత్తితో దాడికి యత్నించగా గ్రామానికి చెందిన కొండయ్య చేతి వేలికి గాయమైంది. స్థానికులు యువకుడిని తాళ్లతో కట్టి బంధించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. గుల్లిపాడు రైల్వే స్టేషన్‌లో ఆ యువకుడు శుక్రవారం రాత్రి దిగినట్టు స్థానికులు చెబుతున్నారు.

పట్టుబడ్డ సైకో

కోలాటం ఆడుతున్న మహిళలు

గౌరీ పరమేశ్వరుల ఊరేగింపు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని రావణాపల్లి గ్రామంలో శనివారం గౌరీపరమేశ్వరుల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. చిటికెల భజనలు, చిడతలు, కోలాటములతో అంగరంగ వైభవంగా పార్వతి పరమేశ్వరులను రిజర్వాయర్‌లో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కిలపర్తి పెద్దిరాజు, ఎఎంసి చైర్మన్ కొల్లు సత్యనారాయణ, కొల్లు చిన తాతలు, కొల్లు బైరాగి, మడగల పైడియ్య, కొల్లు గంగునాయుడు, కొల్లు రాము, కొల్లు లోవరాజు, కొల్లు రామునాయుడు, కొల్లు చిన్నబ్బాయి, చిరంజీవి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు తొలగించాలి

ప్రజాశక్తి-మాడుగుల: ధాన్యం కొనుగోలులో రైతులు పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వం తొలగించాలని కేజే పురం ఎంపిటిసి బీసెట్టి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మే నెల వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా, పంట కోసే సమయానికి వరి పంట తడిచి రైతులు నష్టపోగా, తడిచిన పంట ఎండబెట్టి రైతు భరోసా కేంద్రాలకు తీసుకు వెళ్లారన్నారు. అమ్మకానికి తగ్గట్టు షెడ్యూల్ ఇవ్వడం లేదని, మిల్లర్ల బ్యాంకు గ్యారంటీ కాలపరిమితి ముగుస్తుందని, రెన్యువల్ తరువాత పంట కొనుగోలు చేస్తామని అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. మే నెల వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా, ఫిబ్రవరి 15 వరకే కొనుగోలు చేస్తామని అధికారులు సమాధానం ఇస్తున్నారని అన్నారు. స్థానికంగా అందుబాటులో ఉన్న మిల్లర్లను సూచించకుండా పద్మనాభం, బిక్కవోలు మిల్లర్ల పేర్లు సూచించడం సరికాదన్నారు. మే నెల వరకు కొనుగోలు జరపాలని డిమాండ్ చేశారు.

మహిళలకు టైలరింగ్ సామగ్రి అందజేత

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని వేంపాడు ఎస్సీ కాలనీలో బిసిటి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టైలరింగ్ శిక్షణా కేంద్రంలో శిక్షణ పొందుతున్న మహిళలకు శనివారం టైలరింగ్ సామాగ్రిని అందజేశారు. ఎఫ్‌పిసి సీఈఓ గింజాల అప్పారావు, సంస్థ ప్రతినిధులు దివ్య సుధ, రజిని చేతుల మీదుగా శిక్షణ పొందుతున్న మహిళలకు కత్తెర ఇతర టైలరింగ్ సామాగ్రిని అందజేశారు. ఆరు నెలలపాటు టైలరింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళలు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ పార్వతి పాల్గొన్నారు.

సామగ్రి అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

ప్రతిపక్షాల ఆరోపణలు అవాస్తవం

ప్రజాశక్తి - రావికమతం: మండలంలోని చీమలపాడు పంచాయతీ కళ్యాణపులోవ పోతురాజుబాబు విగ్రహాల తొలగింపుపై ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేయడం సరి కాదని కవగుంట సర్పంచ్ దాసరి సూర్య కుమారి వరహాలు ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న కళ్యాణపులోవ ఉత్సవాలను దృష్టిలో పెట్టుకొని మంచి, పెద్ద విగ్రహాలను ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో శాస్త్ర యుక్తంగా పాతవి తొలగించి వాటి స్థానంలో కొత్తవి నిర్మాణం చేయడానికి దేవస్థానం కమిటీ నిర్ణయించిందన్నారు. చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ దేవాలయానికి లక్షలాది నిధులు కేటాయించి అభివృద్ధి పరిచారన్నారు. రాజకీయంగా అధికారపక్షంపై బురద జల్లి ప్రతిపక్షాలు లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు.

జాతరకు సిద్ధం

ప్రజాశక్తి-యస్.రాయవరం: మండలం లోని రేవు పోలవరం గ్రామంలో ఈనెల 5న జరిగే మాఘ పౌర్ణమి జాతరకు సిద్ధం చేస్తున్నట్లు ఆలయ కమిటీ ధర్మకర్త శ్రీరామ్‌మూర్తిరాజు తెలిపారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ, సత్యసాయి సేవ సమితి సభ్యులు అన్ని విధాలుగా సహాయ సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. వాటర్, మజ్జికలు, భోజనాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

జిప్సం పంపిణీ చేస్తున్న సర్పంచ్లు, శాస్త్రవేత్తలు

రైతులకు జిప్సం పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని లింగంపేట గ్రామంలో బిసిటి కృషి విజ్ఞాన కేంద్రం (హరిపురం) ఆధ్వర్యంలో శెనగ పంట రైతులకు జిప్సం పంపిణీ చేశారు. అనంతరం జిప్సంతో కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో లింగంపేట సర్పంచ్ తోకల సంతోష్, శాస్త్రవేత్తలు డాక్టర్ నాగేంద్రప్రసాద్, డాక్టర్ ప్రసాద్, ఆత్మ బిటిఎం చిటికెల లక్ష్మీకిశోర్, నూకాంబిక దేవాలయ పూజారి గోలకొండ త్రిమూర్తులు పాల్గొన్నారు.

వాలీబాల్‌లో వెంకటేష్ సత్తా

ప్రజాశక్తి-మాడుగుల: వాలీబాల్ క్రీడలో గ్రామీణ యువకుడు సత్తా చాటుతున్నాడు. మండలంలోని జాలంపల్లి గ్రామానికి చెందిన గొంప వెంకటేష్ ఈ క్రీడ పట్ల ఆసక్తితో సాధన చేశాడు. ఇతని తల్లిది ఇదే గ్రామం కాగా తండ్రిది కొత్తకోట అయినప్పటికీ విద్యాభ్యాసం జాలం పల్లిలో కొన సాగింది. తల్లిదండ్రులు కొద్ది కాలంగా ఉపాధి నిమిత్తం విజయవాడలో నివసిస్తున్నారు. ఈ యువకుడు అక్కడి సిద్దార్థ కళాశాలలో చదువుకుంటూ జిల్లా స్థాయి నుండి ప్రతిభ చూపి 2022 లో జూనియర్ స్థాయిలో ఆంధ్ర జట్టుకు ప్రాతినిథ్యం వహించి జాతీయ క్రీడల్లో పాల్గొన్నాడు. గత నెల హైదరాబాద్ పటాన్ చెరువులో జరిగిన ఆహ్వాన పోటీలలో కృష్ణా జిల్లా తరపున పాల్గొన్నాడు. రైల్వే జట్టు విన్నర్స్ గా నిలవగా,కృష్ణా జట్టు రన్నర్స్ గా నిలిచింది. ఈ పోటీలలో వెంకటేష్ ఉత్తమ లిబ్రోగా బహుమతి సాధించడం విశేషం. అంతర్జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనడం తన ధ్యేయమని వెంకటేష్ ప్రజాశక్తికి తెలిపాడు.

బహుమతి స్వీకరిస్తున్న వెంకటేష్

అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి-కలెక్టరేట్: సామాజిక బాధ్యతతో ప్రతీ ఒక్కరు సేవా కార్యక్రమాలు కొనసాగించాలని, ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. న్యూ హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాక్ డేల్ హోటల్ లో శనివారం వారియర్ ఆఫ్ ది ఇయర్2023 అవార్డుల ప్రదానం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ,వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన వారికి ఈ విధంగా సత్కరించడం అభినందనీయం అన్నారు. విజెఎఫ్ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు, న్యూ హోప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మల్లీశ్వరి మాట్లాడారు. కార్యక్రమంలో కడప డిప్యూటీ మేయర్ ధనుంజయ్,బిసి ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్, వెంకట శ్రీనివాస్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

వెంకటరాజుని సత్కరిస్తున్న నాయకులు

పద్మశ్రీ అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి-యస్.రాయవరం: మండలంలోని ఏటికొప్పాక లక్క బొమ్మల కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతలపాటి వెంకటరాజుని స్థానిక నాయకులు సన్మానించారు. స్థానిక లక్కబొమ్మల కళాకారుడు చింతలపాటికి కేంద్ర ప్రభుత్వం ఇటీవల పద్మశ్రీ పురస్కారం ప్రకటించింది. ఆయనను తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నల్లపరాజు వెంకటరాజు సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక కళాకారుడు చింతలపాటి వెంకటరాజుకి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ ప్రకటించడం గర్వించదగ్గ విషయమన్నారు.ఈ కార్యక్రమంలో భాజపా జోనల్ ఇంచార్జ్ రవిరాజు, వేగి నాయుడు, వైసీపీ నాయకులు మణి రాజు, యేజర్ల కిరణ్, శ్రీనురాజు పాల్గొన్నారు.

మల్లవరం గ్రామస్తుల నిరసన

ప్రజాశక్తి -మాకవరపాలెం: నివాసాల మధ్య చర్చి నిర్మాణం చేయరాదంటూ మల్లవరం గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం నిరసన చేపట్టారు. మల్లవరంలో ఇళ్ల మధ్య చర్చి నిర్మాణం చేపడుతున్నారని, అనుమతులు నిలిపి వేయాలని స్థానికులు తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ ప్రసాదరావుకి వినతి పత్రం అందజేశారు.

నిరసన చేపడుతున్న గ్రామస్తులు

కేన్సర్‌పై అవగాహన ఉండాలి

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: కేన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా ఆర్.కె. బీచ్ లోని కాళీమాత టెంపుల్ వద్ద మహాత్మాగాంధీ కేన్సర్ ఆసుపత్రి, గీతం, సిఐఐ, సంస్థలు ఏర్పాటు చేసిన వాక్ మారథాన్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మనం తీసుకునే ఆహారం కలుషితం కావడంతో కేన్సర్ వ్యాధి సంక్రమిస్తుందని వివరించారు. కెమికల్స్ లేని ఆహారం తీసు కోవడంతో కేన్సర్ నుండి మనం రక్షించు కుంటామన్నారు. ప్రతీ మెడికల్ కళాశాలలో కేన్సర్ యూనిట్ ఏర్పాటు చేస్తామన్నారు. వైజాగ్‌లో హోమీ బాబా కేన్సర్‌తో ప్రభుత్వం ఎంఒయు చేసుకున్నట్లు తెలిపారు. కింగ్ జార్జ్ ఆసుపత్రిలో రూ.50 కోట్లతో అధునాతన వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ ప్రస్తుతం ఆహారం కలుషితం అవుతున్నందున ఎంతో మంది కేన్సర్‌కు గరవుతున్నారన్నారు. కేన్సర్ కు సంబంధించి కెజిహెచ్‌లో అధునాతన వైద్య పరికరాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ శ్రీకాంత్, గాజువాక శాసన సభ్యులు తిప్పల నాగిరెడ్డి, విఎంఆర్‌డి అధ్యక్షులు అక్కరమాని విజయ నిర్మల, కెజిహెచ్ సూపరింటెండెంట్ అశోక్ కుమార్, ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్ ఎండి ఓ. మురళీకృష్ణ పాల్గొన్నారు.

'ధాన్' ఫౌండేషన్ ఆధ్వర్యాన వాక్‌థాన్

ప్రజాశక్తి - కలెక్టరేట్: ధాన్ ఫౌండేషన్ వైజాగ్ రీజియన్ ఆధ్వర్యంలో శనివారం "నూతన సామాజిక ఒరవడి" అనే అంశంపై వాక్‌థాన్ కార్యక్రమం నిర్వహించారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ముందుగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ పూర్వ డైరెక్టర్ ప్రసాద్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ధాన్ ఫౌండేషన్ రీజనల్ కో ఆర్డినేటర్ శైలజ వాకథాన్ ఉద్దేశ్యాన్ని వివరించారు. ధాన్ ఫౌండేషన్ ప్రోగ్రాం లీడర్ జానకీరామన్ మాట్లాడుతూ చిన్నప్పటినుండి పిల్లలలో మంచి విలువలు పెంపొందించాలని, తల్లులే ప్రధాన పాత్ర వహించాలని పిలుపునిచ్చారు.ధాన్ ఫౌండేషన్ పూర్వ ప్రోగ్రాం లీడర్ కె.రమాప్రభ మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలు సామాజిక అంశాల పై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ఉండాలన్నారు. ఫిషరీస్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ కిరణ్ మాట్లాడుతూ జీవనోపాధి పై మహిళలు ఎక్కువ శ్రద్ధ పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూ డబ్ల్యూ ఫౌండేషన్ ప్రతినిధులు భాను ప్రకాష్, సమాఖ్య నాయకులు ఆదిలక్ష్మి, గౌరీ, నళిని, లీల, షబీద, రమ, కళంజియం సభ్యులు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న పూర్వ డైరెక్టర్ ప్రసాద్, చిత్రంలో రమాప్రభ

జాతీయ స్థాయి పోటీలకు బాక్సర్ల ఎంపిక

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్: నింజాస్ అకాడమీకి చెందిన ఇద్దరు వూష బాక్సర్లు ఈ నెల 7 నుండి 11 వరకు పంజాబ్‌లోని చండీగఢ్‌లో జరుగనున్న ఆల్ ఇండియా యూనివర్సిటీ వూష టోర్నమెంట్‌లో ఆడనున్నారు. నింజాస్ అకాడమీ నుండి వేపాడ ప్రియాంక 70 కేజీలు, లాలం ప్రవల్లిక 75 కేజీల విభాగంగా ఆడనున్నారు. వీరిద్దరూ నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకుంటున్నారు. గత నెలలో స్టేట్ ఆంధ్ర యూనివర్సిటీలో ఇంటర్ కళాశాలలో గోల్డ్ మెడల్ సాధించి ఈ అవకాశం లభించిందని కోచ్ శేఖర్ తెలిపారు. అనంతరం 66వ ఏపి స్టేట్ స్కూల్ గేమ్స్ గోల్డ్ సాధించిన బాక్సర్ బొంతు మౌనికను సన్మానించారు. చైర్మన్ వెలగా నారాయణరావు, బిజెపి నాయకుడు అడిగర్ల సతీష్, డైరెక్టర్ రమా, బోళెం శివ, మాకిరెడ్డి రవి, శావ్ కోచ్ అబ్బు, డిగ్రీ కళాశాల పిడి సురేష్‌లు అభినందించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మహిళలతో మాట్లాడుతున్న బూడి

ప్రజాశక్తి-మాడుగుల: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు తెలిపారు. శనివారం జంపె లో గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు మాడుగులలో సుమారు రూ.11 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం వివిధ రకాలుగా సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ది కార్యక్రమాలను సైతం అమలు చేస్తుందన్నారు. ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్ అహర్నిశలు కష్ట పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెదబాబు, వైస్ ఎంపీపీలు తాలపురెడ్డి రాజారాం, కొత్తపల్లి శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, పెద్ద సంఖ్యలో మండలంలోని వైసీపీ నేతలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి పథకాలు : ధర్మశ్రీ

కొత్తకోట: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తెలిపారు. రావికమతం మండలం మేజర్ పంచాయతీ కొత్తకోట 1 వ సచివాలయ పరిధిలో శనివారం గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఒకటోవ వార్డు నుంచి 4 వ వార్డు వరకూ ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో తాగునీటి అవసరాలకు సుమారు రూ. ఏడు కోట్ల నిధులు మంజూరు చేయించామని పేర్కొన్నారు. సుమారు 240 మందికి జగనన్న గృహ వసతి కల్పిస్తున్నామని ఈ కార్యక్రమంలో ఎంపిపి పైల రాజు, ఎంపిడివో వెంకన్నబాబు, గ్రామ సర్పంచ్ కోన లోవరాజు, ఉపసర్పంచ్, పి.దేవ, డిసిఎంఎస్ డైరెక్టర్ జి. సత్యదేవ్, ఎంపిటిసి పూడి దేవ, కె.లక్ష్మి శంకర్, పైల చిన్నమ్ములు, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి ఆదిమూర్తి, కె.జగ్గారావు, కె.గున్నాజీ, పంచాయతీ కార్యదర్శి కె.కృష్ణ మోహన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ధర్మశ్రీ

ఉపాధి కూలీకి గాయాలు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలోని బోడపాలెం గ్రామ పంచాయతీలో ఉపాధి కూలీ చింతకాయల సత్యవతికి పని ప్రదేశంలో గాయమైంది. స్థానిక సర్పంచ్ ఏరుకునాయుడు, ఉపాధి సిబ్బంది నర్సీపట్నం ప్రాంతీయ హాస్పిటల్‌కు తీసుకువెళ్లి వైద్యం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ బాధితురాలికి మెరుగైన వైద్యం తో పాటు ఆర్థిక సహాయం అందజేయాలని ఉపాధి సిబ్బందిని ఆయన కోరారు.

సపర్యలు చేస్తున్న సర్పంచ్, కూలీలు

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి -మాకవరపాలెం: ఉగాది నాటికి జగనన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఎంపీడీవో ఆరుణశ్రీ లబ్ధిదారులకు సూచించారు. శనివారం తామరం, మాకవరపాలెంలో ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలని, లేని పక్షంలో స్థలం రద్దువుతుందన్నారు. నిర్మాణాలు పూర్తి చేసిన వారికి బిల్లులు మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ జెఈ రామలింగస్వామి నాయుడు, విద్యుత్ శాఖ జెఈ బాలకృష్ణ, వైసిపి నాయకులు బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-రావికమతం :అనకాపల్లికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్) జన్మదిన వేడుకలను తట్టబందలో మాజీ సర్పంచ్ రమణ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రమణ మాట్లాడుతూ, సుమారు 280 మంది వృద్ధులకు ఉచితంగా బట్టలు పంపిణీ చేశామన్నారు. ఎంవిఆర్ ఇటువంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పలువురు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి-రావికమతం: మండలంలోని కొమిర గ్రామంలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక పూరిల్లు శనివారం కాలి బూడిదైంది. గ్రామానికి చెందిన వానపల్లి సత్యవతి ఇంటిలో ఉన్న బట్టలు, తిండి గింజలు, వంట పాత్రలు, సామాగ్రి కాలి పోవడంతో కుటుంబస్తులు వీధిన పడ్డారు.రావికమతం అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి వెంటనే చేరుకొని పక్కన ఉన్న ఇళ్లకు మంటలు వ్యాప్తి చెందకుండా అదుపు చేశారు. అధికారులు, నాయకులు స్పందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితులు కోరారు.

జగనన్న గృహాల పరిశీలన

ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్: మండలంలోని చెట్టుపల్లి గ్రామంలోని జగనన్న లేఅవుట్‌లను ఎంపీడీవో ఎన్. జయమాధవి శనివారం పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంతో గృహాలను త్వరగా పూర్తి చేసుకోవాలని ఆమె లబ్ధిదారులకు సూచించారు. ఆమె వెంట హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్: మండలంలోని ధర్మసాగరం గ్రామంలో శ్రీకృష్ణుని ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో టిటిడి మంజూరు చేసిన రూ.9 కోట్ల వ్యయంతో 90 దేవాలయాలు నిర్మిస్తున్నామని తెలిపారు. మరో వంద దేవాలయాల నిర్మాణానికి ప్రతిపాదన పంపామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొంప కన్నయ్యనాయుడు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

టిడిపి శ్రేణుల నిరసన

ప్రజాశక్తి నర్సీపట్నం రూరల్: టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా లోకేష్ యువగళం పేరుతో చేస్తున్న పాదయాత్రకు ఆటంకాలు కలిగిస్తున్న తీరుకు వ్యతిరేకంగా నర్సీపట్నంలోని టీడీపీ శ్రేణులు శనివారం అబీద్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి వెంకటరమణ మాట్లాడుతూ, పాదయాత్రను అడుగడుగునా అడ్డంకులు సృష్టించడం ఎంత వరకు సమంజసమన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మధు, శ్రీకాంత్, నాయకులునాగేశ్వరరావు పాల్గొన్నారు.